ప్రతి అక్షరం - ప్రజల కోసం

# రోమింగ్ న్యూస్

తెలుగు దినపత్రిక

యాదాద్రి భువనగిరి

పేజీలు : 8
సంపుటి : 3
సంచిక : 67

శుక్రవారం 9 ఆగస్టు 2024 | చీఫ్ ఎడిటర్ : గొట్టిపర్తి భాస్కర్ | HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA, NIZAMABAD, WARANGAL, MAHABUBNAGAR.RANGAREDDY, MEDAK, ADILABAD



## కొలువుదీరిన తాత్కాలిక ప్రభుత్వం

బంగ్లా ప్రభుత్వ ప్రధాన సలహాదారుగా యూనస్ ప్రమాణం..


అభినందించిన భారత ప్రధాని మోదీ

హిందువులకు భద్రత కల్పించాలని విజ్ఞప్తి

దేశ ప్రజలనుద్దేశించి మహమ్మద్ యూనస్ వ్యాఖ్యలు

ఢాకా/న్యూఢిల్లీ, ఆగస్టు 8: విద్యార్థుల కోటా ఉద్యమంతో కల్లోలంగా మారిన బంగ్లాదేశ్‌లో నోబెల్ గ్రహీత మహమ్మద్ యూనస్ నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వం కొలువుదీరింది. అధ్యక్షుడి అధికారిక నివాసం బంగభవన్ దర్బార్‌హాల్‌లో గురువారం సాయంత్రం 8.30కు జరిగిన కార్యక్రమంలో

మిగతా 2 లో



## యథాతథంగా ద్రవ్య పరపతి విధానం

### రెపోరేటులో మార్పు లేదన్న ఆర్‌బిఐ

యూపిఐ చెల్లింపుల్లో 5 లక్షల వరకు అనుమతి

వివరాలు వెల్లడించిన గవర్నర్ శక్తికాంత్ దాస్

విశ్లేషకుల అంచనాలకు అనుగుణంగానే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్పులు చేర్పులు చేయకుండా కీలక వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించింది. పరపతి విధాన కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశ నిర్ణయాలను గవర్నర్ శక్తికాంత దాస్ గురువారం ప్రకటించారు. రెపోరేటును 6.5 శాతం వద్ద కొనసాగిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. 2023 ఫిబ్రవరి నుంచి కూడా రెపో రేటును ఆర్‌బీఐ యథాతథంగా కొనసాగిస్తూ వస్తోంది. ఆర్‌బీఐ బెంచ్‌మార్క్ వడ్డీ రేటును యథాతథంగా కొనసాగించడం ఇది 9వ సారి కావడం గమనార్హం.

ముంబై,ఆగస్ట్8 : ద్రవ్యోల్బణం, వృద్ధి అనేవి రెండూ కూడా సమానంగా అభివృద్ధి చెందుతున్నాయి. అయినప్పటికీ ఆహార ధరల విషయమంలో అప్రమత్తత అవసరమని శక్తికాంత దాస్ పేర్కొన్నారు. కేంద్రంలో నరేంద్ర మోదీ నేతృత్వంలో మూడోసారి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎంపీసీ

మిగతా 2 లో



# హైదరాబాద్‌లో చార్లెస్ స్క్వాబ్ సెంటర్

ఆర్థిక సేవల బహుళ జాతి సంస్థ భారత్‌లో నెలకొల్పే తొలి కేంద్రం

డాలస్‌లో సీఎం రేవంత్‌రెడ్డితో కంపెనీ ప్రతినిధుల చర్చలు

స్థానికంగా ఉన్న గాంధీజీ విగ్రహానికి ముఖ్యమంత్రి నివాళి

మహాత్మాగాంధీ విగ్రహానికి రేవంత్ నివాళులు

కాలిఫోర్నియాలో సీఎంకు ఎన్నారైల ఘనస్వాగతం




ఆర్థికపరమైన సేవల్లో పేరొందిన అమెరికా బహుళ జాతి సంస్థ చార్లెస్ స్క్వాబ్ కంపెనీ హైదరాబాద్‌లో టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అమెరికా పర్యటనలో భాగంగా డాలస్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబుతో కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు డెన్నిస్ హెూవార్డ్, రామ బొక్కా చర్చలు జరిపారు.

హైదరాబాద్, ఆగస్టు 8 : కంపెనీ భారత్‌లో తన తొలి కేంద్రాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలనే నిర్ణయాన్ని ప్రకటించింది. సెంటర్ ఏర్పాటుకు తమ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని సీఎం హామీ ఇచ్చారు. కంపెనీ కార్యకలాపాలను వేగవంతం చేసేందుకు మార్గదర్శనం చేస్తామన్నారు. కంపెనీ విస్తరణతో ఆర్థిక సేవల

మిగతా 2 లో



## రాష్ట్రాభివృద్ధికి కలిసి నడుద్దాం..

రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితం..

తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది

బీఆర్ఎస్ సర్కారు నిర్లక్ష్యంతోనే ఆర్ఆర్ఆర్ జాప్యం:కిషన్‌రెడ్డి

న్యూఢిల్లీ, ఆగస్టు 8 : రాజకీయం ఎన్నికల వరకే పరిమితమని, ఆ తర్వాత అభివృద్ధి కోసం అందరూ కలిసి పనిచేయాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) తెలంగాణ యూనిట్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఎంపీలతో

మిగతా 2 లో



## వక్ఫ్ సవరణ బిల్లుపై పార్లమెంటులో రగడ

బిల్లును వ్యతిరేకించిన ఇండియా కూటమి

అంగీకరించేది లేదన్న ఎంఐఎం

జెసిసికి పంపుతున్నట్లు మంత్రి కిరణ్ రిజు వెల్లడి

వక్ఫ్ చట్టంలో కీలక మార్పులు తెచ్చే దిశగా రూపొందించిన సవరణ బిల్లు గురువారం లోక్‌సభ ముందుకొచ్చింది. దీనిపై విపక్షాల నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో బిల్లును జాయింట్ పార్లమెంటరీ కమిటీని పంపుతామని కేంద్రమంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా కిరణ్ రిజిజు గురువారం దీన్ని లోక్‌సభలో ప్రవేశపెట్టారు. అనంతరం దీనిపై సభలో చర్చ ప్రారంభించారు.


న్యూఢిల్లీ,ఆగస్ట్ 8 : విపక్ష నేతలు మాట్లాడుతూ కేంద్రంపై ధ్వజమెత్తారు. ఈ బిల్లు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని, మతపరమైన విభజనకు దారితీస్తుందని కాంగ్రెస్ దీన్ని ఖండించింది. ముస్లింల హక్కుల్ని లాక్కునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, దీనిని తాము అంగీకరించేదే లేదని విపక్ష నేతలు భగ్గుమన్నారు. అయితే, విపక్షాల ఆరోపణలను కిరణ్ రిజిజు తోసిపుచ్చారు. సచార్ కమిటీ నివేదిక మేరకు బిల్లును రూపొందించాం. బిల్లుపై దేశవ్యాప్తంగా సంప్రదింపులు జరిపాం. దీని వల్ల మతపరమైన స్వేచ్ఛకు ఆటంకం ఉండదు. ఇతరుల హక్కులను హరిస్తుందనే ప్రశ్నే ఉత్పన్నం కాదు. ఇప్పటివరకు హక్కులు పొందని వారికి దీంతో ప్రయోజనం చేకూరుతుంది. వక్ఫ్ బోర్డులను మాఫియా ఆక్రమించిందని చాలా మంది ఎంపీలు చెప్పారు. కొందరు

మిగతా 2 లో

## కుప్పకూలిన సుంకిశాల గోడ

ధ్వంసమైన రెండో టన్నెల్ గేటు.. వంద మందికి త్రుటిలో తప్పిన పెను ముప్పు

అది నాగార్జున సాగర్ జలాశయానికి ఆనుకుని నిర్మిస్తున్న సుంకిశాల ప్రాజెక్టు! నిత్యం ఒక్కో షిఫ్టులో అక్కడ వంద మంది పని చేస్తూ ఉంటారు! ఈనెల 2న రాత్రి షిఫ్టు చేసిన కార్మికులు ఉదయం ఆరింటికి బయటకు వెళ్లారు! పగలు డ్యూటీ కార్మికులు ఇంకా లోపలికి రాలేదు! ఆ సమయంలో భారీ శబ్దం! టన్నెల్ గేటు, ఇన్‌టేక్ వెల్ రక్షణ గోడ ఒక్కసారిగా కుప్పకూలాయి. కళ్లు మూసి తెరిచేలోగానే ఇన్‌టేక్ వెల్ (భారీ సంపు) నీట మునిగింది! ఆ సమయంలో అక్కడ కార్మికులు ఎవరూ లేకపోవడంతో పెను ముప్పు తప్పింది. ఇదే ప్రమాదం అరగంట ముందు జరిగి ఉంటే సుమారు 100 మంది కూలీలు జలసమాధి అయ్యేవారు.



.. వివరాలు 2లో



## నాగార్జున సాగర్‌కు పోటెత్తిన వరద

26గేట్లు ఎత్తి 4లక్షల క్యూసెక్కుల విడుదల

ప్రస్తుతం 3.74 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

కడలి దిశగా గోదావరి, కృష్ణమ్మ పరుగులు

సముద్రంలో కలిసిన 1,756 టీఎంసీలు

నాగార్జునసాగర్‌కు పోటెత్తిన వరద నాగార్జునసాగర్, ఆగస్టు 8 : కృష్ణా బేసిన్‌లోని అన్ని ప్రాజెక్టులకు వరద కొనసాగుతోంది. ప్రాజెక్టులన్నీ నిండుగా ఉండటంతో వచ్చిన వరదను వచ్చినట్లే దిగువకు వదిలేస్తున్నారు. శుక్రవారం నాగార్జునసాగర్‌కు

మిగతా 2 లో



## రేషన్ కార్డుల జారీ కోసం కేబినేట్ సబ్ కమిటీ

హైదరాబాద్,ఆగస్ట్8 : కొత్త రేషన్ కార్డులు, హెల్త్ కార్డుల జారీ కోసం మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటైంది. పౌరసఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఛైర్మన్‌గా, దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సభ్యులుగా మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేశారు. ఇటీవల కేబినెట్ నిర్ణయం మేరకు సీఎస్ శాంతి కుమారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త రేషన్ కార్డులు, హెల్త్ కార్డుల జారీకి అర్హతలు, విధివిధానాలను మంత్రివర్గ ఉపసంఘం సిఫారసు చేయనుంది. రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు వేర్వేరుగా ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. రేషన్ కార్డుల కోసం వార్షికాదాయం, భూ పరిమితి తదితర అంశాలపై సబ్ కమిటీ అధ్యయనం చేయనుంది.

## ఏది అబద్ధం?



పంచాయతీలకు కేంద్రమిచ్చిన నిధులు మళ్లించడమా?

9నెలల పాలనల్లో 9పైసలు కూడా ఇవ్వకపోవడమా?

మంత్రి సీతక్కను ప్రశ్నించిన హరీశ్‌రావు

.. వివరాలు 2లో

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శుక్రవారం 9 ఆగస్టు 2024





# హైదరాబాద్‌లో 'చార్లెస్ స్క్వాబ్ సెంటర్'

## మొదటి పేజీ తరువాయి

రంగంలో హైదరాబాద్ ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**బుద్ధదేవ్ మృతికి సీఎం సంతాపం**

పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం, సీపీఎం నేత బుద్ధదేవ్ భట్టాచార్య మరణం పట్ల సీఎం రేవంత్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. రెండుసార్లు ముఖ్యమంత్రిగా, ఐదు దశాబ్దాలు సుదీర్ఘ ప్రజాసేవలో గడిపిన బుద్ధదేవ్ సేవలు మరువలేనివన్నారు. నిజాయతీకి మారుపేరుగా నిలిచిన భట్టాచార్య మరణం తీరని లోటని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులు, సీపీఎం కార్యకర్తలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**మహాత్ముడికి సీఎం నివాళులు**

సీఎం రేవంత్‌రెడ్డి గురువారం డాలస్‌లోని మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. మంత్రివర్గ సహచరులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కూడా ఉన్నారు. సీఎం నేతృత్వంలోని బృందం గురువారం రాత్రి కాలిఫోర్నియా చేరుకోగా.. విమానాశ్రయంలో స్థానిక ఎన్నారైలు ఘనంగా స్వాగతం పలికారు.

**రాష్ట్ర ప్రయోజనాలు తప్ప మరేమీ లేదు: జయేశ్ రంజన్**

సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో అమెరికా పర్యటన విజయవంతంగా సాగుతోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన మీడియాకు వీడియో సందేశం పంపారు. అమెరికా పర్యటనలో ప్రతి పెట్టుబడి వెనక రాష్ట్ర ప్రయోజనాలు తప్ప మరో అంశమే లేదన్నారు. పెట్టుబడులు కచ్చితంగా వస్తాయన్న పారిశ్రామికవేత్తలతోనే తాము సమావేశం అవుతున్నామని, ఆషామాషీగా భావించడం లేదని తెలిపారు.

ప్రతి సమావేశాన్ని సీఎం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నారని, ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరమే కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నామని వివరించారు. అమెరికా పర్యటనలో ఒప్పందం కుదుర్చుకున్న కంపెనీ సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడిదన్న కేటీఆర్ వ్యాఖ్యల నేపథ్యంలో.. తమ పర్యటన గురించి జయేశ్ రంజన్ వీడియో సందేశం పంపారు. ఇక ప్రపంచబ్యాంకు అధ్యక్షుడితో జరిగిన సమావేశం విజయవంతమైందని ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు కూడా వీడియో సందేశం పంపారు.



**ఆదివాసీలకు సీఎం రేవంత్ శుభాకాంక్షలు**

అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని (ఆగస్టు 9) పురస్కరించుకొని గిరిజనులకు సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. మూలవాసులుగా, అమ్మలాంటి అడవికి తోడుండే భూమిపుత్రులుగా ఆదివాసులు నిలుస్తారని, వాళ్లు కల్మషం లేని అనుబంధాలకు ప్రతీకలని అభినందించారు. గిరిజనుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, అభివృద్ధికి తమ ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం రేవంత్ గురువారం విడుదల చేసిన సందేశంలో పేర్కొన్నారు. గిరిజన సంక్షేమం కోసం బడ్జెట్‌లో రూ. 17,056 కోట్లు కేటాయించామని తెలిపారు. ప్రతి గిరిజన గూడానికి రోడ్లు, విద్యుత్, వైద్యం, విద్య వంటి మౌలిక సదుపాయాల కల్పనకు కట్టుబడి ఉన్నామని సీఎం రేవంత్ స్పష్టం చేశారు.

# వక్ఫ్ సవరణ బిల్లుపై పార్లమెంటులో రగడ

## మొదటి పేజీ తరువాయి

ఎంపీలు వ్యక్తిగతంగా ఈ బిల్లుకు మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. కొన్ని పార్టీలు సిద్ధాంతపరంగా మద్దతు ఇవ్వలేమని చెప్పాయి. వక్ఫ్ బోర్డులో వివిధ మతాల సభ్యులుండాలని మేం చెప్పట్లేదు. పార్లమెంట్ సభ్యుడు మాత్రం బోర్డులో ఉండాలంటున్నాం అని కేంద్రమంత్రి వివరించారు. అయితే, విపక్షాల అభ్యంతరాల నేపథ్యంలో ఈ బిల్లును జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపనున్నట్లు రిజిజు వెల్లడించారు. వక్ఫ్ పాలకవర్గాల్లో మరింత పారదర్శకత, జవాబుదారీతనం పెంచుతూ పాలనలో మహిళల భాగస్వామ్యం తప్పనిసరి చేసే విధంగా ఈ కొత్త బిల్లును కేంద్రం తీసుకొచ్చింది. ఈ మేరకు 1995 నాటి వక్ఫ్ చట్టంలో దాదాపు 40 సవరణలు చోటుచేసుకోనున్నాయి. ముస్లిం సమాజం నుంచి వస్తున్న డిమాండ్ల మేరకే ఈ మార్పులు చేస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెప్పాయి. కొత్త బిల్లు అమలులోకి వస్తే జిల్లా కలెక్టర్లు రూపొందించిన వాస్తవ అంచనా విలువల మేర వక్ఫ్ బోర్డులు తమ ఆస్తులను తప్పనిసరిగా నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. భాజపా సర్కారు ఎప్పట్నుంచో ఈ సవరణల గురించి ఆలోచిస్తోందని, ఇది సరైన నిర్ణయం కాదని ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఇదివరకే ఈ బిల్లును వ్యతిరేకించింది. ఈక్రమంలో వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుపై పార్లమెంట్ లో చర్చ సందర్భంగా రచ్చ రచ్చ అయింది. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును ప్రతిపక్ష ఇండియా కూటమి వ్యతిరేకించింది. వక్ఫ్ బోర్డులో కేంద్రం జోక్యంపై ఎంఐఎం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. కేంద్రం చేసిన సవరణలను ఇండియా కూటమి సభ్యులు తీవ్రంగా వ్యతిరేకించారు. దీంతో వక్ఫ్ బోర్డును బిల్లును జేపీసీకి అప్పగించింది కేంద్రం. వక్ఫ్ (సవరణ) బిల్లు 2024 ఆస్తి నిర్వహణపై వక్ఫ్ బోర్డుల అధికారాన్ని పరిమితం చేయడం, ప్రభుత్వ పర్యవేక్షణను పెంచడం ఈ సవరణ బిల్లు లక్ష్యం. మూల్యాంకనం కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వక్ఫ్ ఆస్తులను తప్పనిసరిగా నమోదు చేయాలి. చట్టం ప్రారంభానికి ముందు లేదా తర్వాత వక్ఫ్ ఆస్తులుగా గుర్తించిన ప్రభుత్వ ఆస్తులు వక్ఫ్ ఆస్తులుగా పరిగణించబడవు. జిల్లా కలెక్టర్ ఆస్తి వక్ఫ్ లేదా ప్రభుత్వ భూమి అని నిర్ణయిస్తారు, వారి నిర్ణయం అంతిమంగా ఉంటుంది. కలెక్టర్ రెవెన్యూ రికార్డులను అప్‌డేట్ చేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తారు. కలెక్టర్ నివేదిక అందే వరకు వక్ఫ్ ఆస్తులను గుర్తించరు. వక్ఫ్ బోర్డు నిర్ణయాలకు సంబంధించిన వివాదాలు ఇప్పుడు హైకోర్టులను ఆశ్రయించవచ్చు. మౌఖిక ప్రకటనల ఆధారంగా ఆస్తిని వక్ఫ్‌గా పరిగణించే నిబంధనలను బిల్లు తొలగిస్తుంది. కంఎ÷–టోల్రర్, ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా లేదా నియమించబడిన అధికారులచే నియమించబడిన ఆడిటర్లచే వక్ఫ్ ఆస్తుల ఆడిట్‌లను ఆదేశించే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉంటుంది. సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్ , రాష్ట్ర బోర్డులలో మహిళా ప్రాతినిధ్యం ఉండేలా సవరణలు కూడా కోరుతున్నాయి. 1995 నాటి వక్ఫ్ బోర్డుల చట్టానికి కేంద్రప్రభుత్వం ప్రతిపాదించిన మార్పులు రాజకీయ చర్చకు దారితీశాయి. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 26 ప్రకారం ముస్లిం సమాజం వారి భూమి, ఆస్తులు , మతపరమైన వ్యవహారాలను నిర్వహించే స్వేచ్ఛ నుండి తొలగించడానికి ఈ సవరణలు తీసుకొస్తున్నారని అని ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేశాయి. వక్ఫ్ బోర్డులను నియంత్రించాల్సిన అవసరం ఉందని ముస్లిం సమాజమే కోరుకుంటుందని అధికార ఎన్‌డిఎ వాదిస్తోంది. వక్ఫ్ ఆస్తి అనేది ఒక దస్తావేజు ద్వారా దేవుని పేరు మీద ధార్మిక ప్రయోజనాల కోసం అంకితం చేయబడిన స్థిరాస్తులను సూచిస్తుంది. ఇది అధికారిక డాక్యుమెంటేషన్‌కు ముందు నాటిది కావడంతో చాలా కాలం పాటు ఉపయోగించిన ఆస్తులను కూడా వక్ఫ్ ఆస్తులుగా పరిగణించవచ్చు. ఈ ఆస్తులు పబ్లిక్ ధార్మిక ప్రయోజనాల కోసం లేదా ఒక వ్యక్తి వారసులకు ప్రైవేట్ ప్రయోజనం కోసం కేటాయించబడతాయి. వక్ఫ్ ఆస్తులు బదిలీ చేయబడవు. భగవంతుని పేరు మీద శాశ్వతంగా ఉంచబడతాయి. ఆదాయం సాధారణంగా విద్యా సంస్థలు, శ్మశానవాటికలు, మసీదులు, ఆశ్రయాలకు నిధులు సమకూరుస్తుంది. అనేక మంది ముస్లింలకు ప్రయోజనం చేకూరుస్తుంది.

# కుప్పకూలిన సుంకిశాల గోడ

నాగార్జునసాగర్, ఆగస్టు 8: హైదరాబాద్‌లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా 50 ఏళ్ల వరకు తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం సుంకిశాల వద్ద ప్రాజెక్టు నిర్మాణం చేపట్టింది. దీని నిర్మాణ పనులకు నాటి మంత్రులు కేటీఆర్, తలసాని శ్రీనివాస్, సబిత, మహమూద్ అలీ, జగదీశ్ రెడ్డి 2022, మే 14న శంకుస్థాపన చేశారు. తొలుత, రూ.1,450 కోట్లతో మేఘా ఇంజనీరింగ్ వర్క్స్ ఒప్పందం చేసుకుంది. తర్వాత అంచనా వ్యయం రూ.2,215 కోట్లకు పెంచారు. ప్రాజెక్టులో భాగంగా ఇన్‌టేక్ వెల్(భారీ సంపు), మూడేసి పంప్ హౌజ్‌లు, టన్నెళ్లు, పంప్‌హౌజ్ సూపర్ స్ట్రక్చర్ నిర్మిస్తారు. నాటినుంచి నిర్మాణ పనులు సాగుతున్నాయి.

**మూడు స్థాయిల్లో పంప్‌హౌజ్‌లు**

నాగార్జున సాగర్ జలాశయం కనిష్ఠ నీటి మట్టం (డెడ్ స్టోరేజీ) 510 అడుగులు. ప్రస్తుతం అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. సాగర్‌లో నీటిమట్టం 510 అడుగుల కంటే తగ్గితే.. అక్కంపల్లికి నీళ్లు వచ్చే పరిస్థితి లేదు. నీటి మట్టం 450 అడుగుల వరకూ ఉన్నా నీటిని తరలించేందుకు వీలుగా సుంకిశాల ప్రాజెక్టు చేపట్టారు. అంటే, మండు వేసవిలోనూ హైదరాబాద్ తాగునీటికి ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉండేలా దీనిని నిర్మిస్తున్నారు. ఇందులో భాగంగా జలాశయం నుంచి సొరంగ మార్గం (మూడు టన్నెళ్లు) ద్వారా నీటిని ఇన్‌టేక్ వెల్‌కు తరలిస్తారు. ఇక్కడి నుంచి 30 కి.మీ. దూరంలో ఉన్న పెద్దఅడిశర్లపల్లి మండలం కోదండాపూర్ వాటర్ ప్లాంట్‌లో నీటిని నిల్వ చేస్తారు. అక్కడ ఫిల్టర్ చేసిన తర్వాత జంట నగరాలకు తరలిస్తారు. జలాశయం నుంచి ఇన్‌టేక్ వెల్‌కు నీటిని తరలించడానికి మూడు పంప్‌హౌజ్‌లు నిర్మిస్తున్నారు. వీటిలో మొదటిది, మూడోది పూర్తయ్యాయి.

రెండో టన్నెల్, పంప్ హౌజ్ పనులు కొనసాగుతున్నాయి. జూలై 29, 30, 31 తేదీల్లో టన్నెల్‌కు గేటు అమర్చారు. ఇందుకు రిజర్వాయర్ వైపున్న మట్టిని తొలగించారు. అదే సమయంలో సాగర్‌కు ఎగువ నుంచి భారీ వరద ప్రారంభమైన విషయం తెలిసిందే. దాంతో, టన్నెల్ గేటు ధ్వంసమైంది. దానికి అనుసంధానంగా ఉన్న ఇన్‌టేక్ వెల్ సైడ్ వాల్(రక్షణ గోడ) కూలిపోయింది. ఐదు నిమిషాల స్వల్ప వ్యవధిలోనే 590 అడుగుల ఇన్‌టేక్ వెల్ పూర్తిగా నిండిపోయింది. ఇంత పెద్ద ప్రమాదం జరిగి వారం రోజులు గడిచినా.. హైదరాబాద్ జలమండలి బయటకు వెల్లడించలేదు. నిర్మాణ సంస్థ కూడా గోప్యంగానే ఉంచింది. గోడ కూలుతున్న సమయంలో అక్కడ పనిచేసే ఒడిశా కార్మికులు తీసిన వీడియో ద్వారా విషయం బయటకు వచ్చింది. రక్షణ గోడ నిటారుగా ఉండడంతో ప్రమాదం ఉంటుందని, దానికి అనుసంధానంగా టై భీమ్‌లను నిర్మించాలని ఐదారు నెలల క్రితమే ఇంజనీరింగ్ అధికారులు సూచించారు. కానీ, నిర్మాణ సంస్థ పట్టించుకోలేదు. అదే సమయంలో గేటు ఏర్పాటుకు రిజర్వాయర్ వైపు మట్టి తొలగింపు పనులు చేశారు. దాంతో, గేటు ధ్వంసమై, రక్షణ గోడ కూలింది.

**మొదటి నుంచీ వివాదాస్పదమే**

సుంకిశాల పంప్‌హౌజ్ నిర్మాణ పనులు పూర్తయితే జంట నగరాలకు ఏఎంఆర్‌పీ నుంచి నీటిని తరలించడం ఆపేసి ఇక్కడి నుంచి నిరంతరాయంగా సరఫరా చేస్తారు. నిజానికి, జంట నగరాలకు సుంకిశాల నుంచి నీటిని తీసుకెళ్లాలని ఉమ్మడి ఏపీ సీఎం కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ప్రతిపాదించారు. అప్పట్లో ఆ పనులను సీపీఎం, టీడీపీ వ్యతిరేకించాయి. దీనిపై అప్పట్లో నార్ల తాతారావు ఆధ్వర్యంలో ఒక కమిటీని వేసింది. ఆ కమిటీ సుంకిశాలతో లాభం లేదని తేల్చి.. అక్కంపల్లి వద్ద ఏఎంఆర్‌పీని ప్రతిపాదించింది. దీంతో, ఎన్టీఆర్ హయంలో అక్కంపల్లి వద్ద పంప్‌హౌజ్‌కు శంకుస్థాపన చేసి అక్కడి నుంచి కోదండాపూర్ పంప్‌హౌసకు తరలించి శుద్ధి చేసిన నీటిని జంట నగరాలకు తరలించే ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర విభజన తర్వాత 2014లో టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఏఎమ్మార్పీకి బదులు సుంకిశాల నుంచి జంట నగరాలకు తాగు నీటిని అందించాలని నిర్ణయించింది.

**పునః నిర్మాణ ఖర్చు మేఘాదే: జల మండలి**

పునర్నిర్మాణ పనులకు రూ.20 కోట్ల వరకూ ఖర్చవుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు. ప్రాజెక్టులో దెబ్బతిన్న భాగాన్ని మేఘా సంస్థే నిర్మిస్తుందని, ఇందుకయ్యే ఖర్చునూ నిర్మాణ సంస్థే భరిస్తుందని వాటర్ బోర్డు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. అనూహ్యంగా భారీ వరద వచ్చి టన్నెల్ వద్ద ఒత్తిడి పెరగడంతో ప్రమాదం సంభవించిందని పేర్కొన్నారు. ఘటనపై బోర్డు స్థాయిలో ఇంజనీర్లతో విచారణ కమిటీ ఏర్పాటు చేశారని, సభ్యులుగా వాటర్ బోర్డు ఈడీ సత్యనారాయణ, రెవెన్యూ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, ప్రాజెక్టు డైరెక్టర్ సుదర్శన్‌ను నియమించారని తెలిపారు. నివేదిక ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటారని, మార్చిలోగా పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఈ ఘటనతో మరో రెండు నెలలు ఆలస్యమవుతుందని వివరించారు. నిజానికి, జలాశయం నీటిమట్టం కనిష్ఠ స్థాయిలో 510 అడుగుల కంటే తక్కువ ఉంటేనే ప్రాజెక్టు నిర్మాణ పనులు సాగుతాయి. లేకపోతే పంప్‌హౌజ్‌లోకి నీళ్లు చేరి పనులకు ఆటంకం ఏర్పడుతుంది. అంటే, సాగర్‌లో నీటి మట్టం డెడ్ స్టోరేజీ కంటే తగ్గితేనే తిరిగి ఇక్కడ పనులు ప్రారంభం కానున్నాయి. అంటే, రాబోయే వేసవిలోనే ఈ పనులు చేయడానికి అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

**ఈ పాపం బీఆర్ఎస్‌దే: భట్టి**

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 8 : కాళేశ్వరం ప్రాజెక్టుతోపాటు సుంకిశాల ప్రాజెక్టులో గోడ కూలిన పాపం కూడా గత బీఆర్ఎస్ పాలకులదేనని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విమర్శించారు. మేడిగడ్డ, సుందిళ్ల మాత్రమే నాసిరకమని అనుకున్నామని.. గోదావరినే కాదు కృష్ణా నదిపై నిర్మించిన ప్రాజెక్టులను కూడా వదిలిపెట్టలేదని సుంకిశాల ఘటన తేటతెల్లం చేస్తోందని మండిపడ్డారు. విద్యుత్తు శాఖపై గురువారం ఆయన ఖైరతాబాద్‌లోని టీజీఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు.

# రాష్ట్రాభివృద్ధికి కలిసి నడుద్దాం..

## మొదటి పేజీ తరువాయి

తెలంగాణలో పారిశ్రామిక అభివృద్ధిపై చర్చ జరిగింది. ఇందులో కిషన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, రఘువీర్‌రెడ్డి, బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్, బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, పార్థసారథిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో ఒకరి ముఖాలు మరొకరు చూసుకునే పరిస్థితి ఉండేది కాదని, ఇప్పుడు మాత్రం అలాంటి పరిస్థితులు లేవని అన్నారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలని, ఆ తర్వాత రాష్ట్రాభివృద్ధే అజెండాగా కలిసి పనిచేయాలని చెప్పారు. 'గాడిద గుడ్డు' అంటూ నాయకులు మాట్లాడడం మంచి సంస్కృతి కాదన్నారు.

తెలంగాణకు కేంద్రం ఏమిచ్చిందో లెక్కలతో సహా వివరించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. వీలైనంత త్వరగా వరంగల్ ఎయిర్ పోర్టు నిర్మాణం చేపడతామన్నారు. హైదరాబాద్ తర్వాత వరంగల్ వేగంగా అభివృద్ధి చెందుతోందని.. పర్యాటకం, ఐటీ, వినోదరంగాల అభివృద్ధిపై దృష్టి సారిస్తున్నామని స్పష్టం చేశారు. గత కేసీఆర్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్) ముందుకు సాగలేదని తెలిపారు. బయ్యారం ఉక్కు కర్మాగారం లాభదాయకం కాదని 3 కమిటీలు చెప్పాయని గుర్తుచేశారు. కేంద్రం నిర్మించకపోతే తామే కర్మాగారాన్ని ఏర్పాటు చేస్తామని కేటీఆర్ ప్రకటించారని.. పదేళ్లు అధికారంలో ఉండి ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. బయ్యారం ఫ్యాక్టరీ లాభదాయకమైతే తానే కేంద్రాన్ని ఒప్పించి డబ్బులు తీసుకువచ్చేవాడినని తెలిపారు.

**పార్టీలకతీతంగా పనిచేద్దాం..**

రాష్ట్రాభివృద్ధి కోసం పార్టీలకతీతంగా కలిసి నడుద్దామని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి అన్నారు. కేంద్రంతో ఘర్షణ వాతావరణం లేకుండా పనిచేయాలని సీఎం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని గుర్తు చేశారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఎక్కడికి రమ్మంటే అక్కడికి వచ్చి చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. మహబూబ్‌నగర్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు కేంద్రం సహకరించాలని కోరారు. ఐఐఎం ఏర్పాటు చేస్తే తెలంగాణ యువతకు మేలు జరుగుతుందని చెప్పారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని, లేదంటే మరే రకంగానైనా నిధులు విడుదల చేసేలా చూడాలని కోరారు. తెలంగాణ పెండింగ్ ప్రాజెక్టులపై ఒక పుస్తకం తయారు చేయించామని, బీజేపీ ఎంపీలకు కూడా ఇస్తామని పేర్కొన్నారు.

**ఖనిజాభివృద్ధిలో ప్రైవేట్ రంగానిది కీలక పాత్ర: కిషన్‌రెడ్డి**

ఖనిజరంగాభివృద్ధిలో ప్రైవేటు రంగం పాత్ర కీలకమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. వికసిత భారత్–2047 లక్ష్యాన్ని చేరుకోవడంలో ఖనిజ రంగానిది ముఖ్య పాత్ర అని చెప్పారు. గురువారం ఢిల్లీలోని ఎమ్‌జీఎమ్ఐ(మైనింగ్, జియలాజికల్, మెటలర్జికల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో గనుల రంగంపై జరిగిన జాతీయ సదస్సులో కిషన్ రెడ్డి మాట్లాడారు. గనుల రంగంలో ఎదురవుతున్న సవాళ్లు, వాటిని పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణల గురించి వివరించారు. భారతదేశంలో విద్యుత్ ఉత్పత్తిని పెంచేందుకు బొగ్గు ఉత్పత్తిని పెంచాల్సిన అవసరం ఉందని చెప్పారు.

ఖనిజాల అన్వేషణ కోసం కంపెనీలు ముందుకు రావడం లేదన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఖనిజాల అన్వేషణ ప్రక్రియలో 50% ఖర్చును భరించేందుకు కేంద్రం ముందుకొచ్చిందని తెలిపారు. గనుల రంగంలో ఆత్మనిర్భరత సాధించేందుకు ఇలాంటి నిర్ణయాలు ఎంతగానో ఉపయోగపడతాయని అభిప్రాయపడ్డారు. యూపీఏ హయాంలో గనుల కుంభకోణాలు వెలుగుచూసిన నేపథ్యంలో పారదర్శకత కోసం వేలం విధానాన్ని తీసుకొచ్చినట్టు స్పష్టం చేశారు.

# యధాతథంగా ద్రవ్య పరపతి విధానం

## మొదటి పేజీ తరువాయి

తొలిసారిగా సమావేశమైంది. మొత్తంగా చూస్తే ఇది 50వ సమావేశం. ఈ సమావేశంలో మానిటరీ పాలసీ కమిటీలోని ఆరుగురిలో నలుగురు పాలసీ రేటును యథాతథంగా ఉంచాలనే నిర్ణయానికి అనుకూలంగా ఓటు వేశారని శక్తికాంత దాస్ చెప్పారు. ముఖ్యంగా.. సెంట్రల్ బ్యాంక్ నుంచి బ్యాంకులు డబ్బు తీసుకునే రేటు. రెపో రేటు స్థిరంగా ఉండటంతో మన రుణ వాయిదాలో ఎలాంటి మార్పులు చేర్పులు ఉండబోవు. రెపో రేటు తగ్గితే మన హోమ్ లోన్, పర్సనల్ లోన్, కార్ లోన్ వాయిదా తగ్గుతుంది. ఆర్‌బీఐ చివరిసారిగా గతేడాది ఫిబ్రవరిలో రెపో రేటును మార్చింది. ఆ తర్వాత 0.25 శాతం పెరిగి 6.50 శాతానికి చేరుకుంది. ఆహార పదార్థాల ధరలు పెరగడంతో ఏప్రిల్ – మే వరకూ స్థిరంగా ఉన్న ద్రవ్యోల్బణం.. జూన్‌లో మళ్లీ పెరిగింది. 2024–25లో వాస్తవ జీడీపీ వృద్ధిరేటు అంచనా 7.2 శాతం కాగా.. ఒకటి, రెండు, నాలుగో త్రైమాసికంలో 7.2 శాతం, మూడో క్వార్టర్‌లో 7.3 శాతంగా ఉండే అవకాశం. ఆహార ద్రవ్యోల్బణం అనేది నైరుతి రుతుపవనాల కారణంగా దిగొచ్చే అవకాశం ఉంది. 2024–25లో ద్రవ్యోల్బణం 4.5 శాతం.. రెండో త్రైమాసికంలో 4.4శాతం.. మూడో త్రైమాసికంలో 4.7శాతం .. నాలుగో త్రైమాసికంలో 4.3 శాతంగా ఉండవచ్చు. భారత కరెన్సీ రూపాయి మారకం విలువ విషయానికి వస్తే.. పరిమిత శ్రేణిలోనే ఉంది. భారత విదేశీ మారక నిల్వలు ఆగస్టు రెండు నాటికి రికార్డ్ స్థాయిలో 675 బిలియన్ డాలర్లకు చేరవచ్చు. రిటైల్ ఇన్వెస్టర్లకు ప్రత్యామ్నాయ పెట్టుబడి అవకాశాలు ఒకవైపు పెరుగుతుంటే.. బ్యాంకుల డిపాజిట్లు తగ్గుతున్నాయి. ఈ నేపథ్యంలో బ్యాంకులు క్రెడిట్ డిమాండ్‌ను అందుకోవ డంలో ఇబ్బంది పడుతున్నాయి. వ్యక్తిగత రుణ వితరణలో గణనీయ వృద్ధిని పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది. టాపప్ లోన్లు, బంగారు రుణాలను ఇవ్వడంలో ఆర్థిక సంస్థలు పెద్దగా నిబంధనలను పాటించడం లేదు. ఇలాంటి వాటిని అరి కట్టాలి. ఇక ఆర్బీఐ సమావేశంలో పలు కీలక నిర్ణయాలను తీసుకోవడం జరిగింది. ముఖ్యంగా ట్యాక్స్ టాక్స్ పేమెంట్లపై యూపీఐ లిమిట్‌ను పెంచుతూ నిర్ణయం తీసున్నారు. గతంలో రూ. లక్ష రూపాయలు ఉండే యూపీఐ లిమిట్‌ను రూ.5 లక్షలకు పెంచినట్టు ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ తెలిపారు. అంటే ఇప్పుడు యూపీఐ ద్వారా ఒకేసారి రూ. లక్ష వరకూ చెల్లించవచ్చు. కేవలం కొద్ది గంటల్లోనే చెక్ క్లియరెన్స్‌కు చర్యలు తీసుకోవాలని ఆర్‌బీఐ గవర్నర్ ప్రతిపాదించారు. పాత ఇంటి రుణంపై అదనపు రుణం తీసుకుంటున్న తీరుపై శక్తికాంత దాస్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇకపై

ట్యాక్స్ చెల్లించేవారు రూ.5 లక్షల వరకూ ఎలాంటి ఇబ్బందీ లేకుండా యూపీఐతోనే చేయవచ్చు. దీనికి ఎలాంటి అదనపు చార్జీలు వేయరు. చెల్లింపులు డెబిట్ లేదంటే క్రెడిట్ కార్డులతో చేస్తే మాత్రం కొంత చార్జీలు పడతాయి. ఆర్బీఐ ఇలా చార్జీలు పెంచడమనేది కొత్తేమీ కాదు.. గతంలోనూ పలు మార్లు పెంచింది. అంతకుముందు 2023 డిసెంబర్‌లోనే హాస్పిటల్, ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ వంటి వాటికి చేసే యూపీఐ పేమెంట్ లిమిట్‌ను ఆర్బీఐ రూ. 5 లక్షలకు పెంచింది. ప్రస్తుతం పన్ను చెల్లింపుల పరిమితిని కూడా పెంచేసింది. సాధారణ యూపీఐ ట్రాన్సాక్షన్ లిమిట్ విషయంలో మాత్రం మార్పేమీ చేయలేదు. అది గరిష్టంగా రూ. లక్ష మాత్రమే ఉంది.

# కొలువుదీరిన తాత్కాలిక ప్రభుత్వం

## మొదటి పేజీ తరువాయి

యూనస్‌తోపాటు.. మరో 16 మందికి గాను.. 13 మంది తాత్కాలిక ప్రభుత్వ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. తాత్కాలిక ప్రభుత్వంలో విద్యార్థి సంఘాల సమన్వయకర్త నహీద్ ఇస్లాం, మరో నాయకుడు ఆసిఫ్ మహమూద్‌కు చోటు దక్కింది. అధ్యక్షుడు మహమ్మద్ షహబుద్దీన్ వీరితో ప్రమాణ స్వీకారం చేయించారు.

యూనస్ ప్రభుత్వ ప్రధాన సలహాదారు(ప్రధానికి ఉండే అధికారాలతో)గా ప్రమాణం చేశారు. మరో ముగ్గురు సభ్యులు రాయ్, చక్మా, బీర్ ప్రతీక్ ఫారూఖ్–ఎ–ఆజమ్ ప్రస్తుతం విదేశాల్లో ఉన్నందున ప్రమాణస్వీకారం చేయలేకపోయారు. ఈ కార్యక్రమంలో 400 మంది దాకా అతిథులు పాల్గొన్నారు. వీరిలో ఆర్మీ చీఫ్ వకార్–ఉజ్–జమా, రాజకీయ పార్టీల నాయకులు, త్రివిధ దళాధిపతులు, దౌత్యవేత్తలు ఉన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్ వేదికగా యూనస్‌కు అభినందనలు తెలిపారు. బంగ్లాదేశ్‌లో హిందువులకు భద్రత కల్పించాలని కోరారు.

ప్రజలు సామరస్యంతో మెలగాలి: యూనస్

దేశంలో శాంతిభద్రతలను పునరుద్ధరించడమే తమ ప్రభుత్వ తొలి కర్తవ్యమని మహమ్మద్ యూన స్ అన్నారు. "ప్రజలు దేశంలో ఎక్కడా ఎవరిపైనా దాడులు జరగకుండా చూసుకోవాలి. బంగ్లాదేశ్ పునర్నిర్మాణంలో అంతా భాగస్వాములు కావాలి" అని పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో, తాత్కాలిక ప్రభుత్వాధినేతగా ప్రమాణ స్వీకారం సందర్భంగా పైవ్యాఖ్యలు చేశారు. దేశంలో హింస ప్రజ్వరిల్లుతోందని, ఇది మంచిది కాదంటూ.. భవిష్యత్‌ను తీర్చిదిద్దుకునేందుకు శాంతిని పాటించాలని ఆయన దేశ ప్రజలను కోరారు. మైనారిటీలైన హిందువులు, బౌద్ధులు, క్రైస్తవులు, అహ్మదీయులపై జరుగుతున్న దాడులను ఖండించారు.

"ఈ దాడులు కుట్రలో భాగమే. ప్రజలు హింస జోలికి వెళ్లొద్దు. మన దేశంలో పుట్టిన ప్రతి వ్యక్తి మన సోదరుడే. నాపై విశ్వాసం ఉంచండి. ప్రభుత్వం మీకు న్యాయం చేస్తుంది. ఒకవేళ మీరు నా మాట వినకపోతే.. నేను ఇక్కడ(ప్రభుత్వంలో) ఉండి కూడా వృథానే. ఇక్కడ నా అవసరం లేదనుకుంటే.. నాకు వీడ్కోలు పలికితే.. నా పని నేను చూసుకుంటాను" అని ఉద్వేగంగా అన్నారు. దేశ ప్రగతికి హింస, గందరగోళ పరిస్థితులే అతిపెద్ద శత్రువులని ఆయన వ్యాఖ్యానించారు. "ఈ రోజు బంగ్లాదేశ్ కొత్త విజయదినోత్సవం. ఈ రోజు మనం మొదలు పెట్టిన నవ బంగ్లాదేశ్ నిర్మాణ ప్రయాణానికి శత్రువులైన వాటిని వీడి.. దేశంకోసం పనిచేద్దాం. విద్యార్థులు హింసను వీడి చదువుపై దృష్టి సారించాలి" అని ఆయన పేర్కొన్నారు.

**అవామీ లీగ్‌పై నిషేధం విధించాలి: బీఎన్‌పీ**

హసీనా పార్టీ అవామీ లీగ్‌పై నిషేధం విధించాలని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ(బీఎన్‌పీ) చైర్‌పర్సన్ ఖలీదా జియా సలహాదారు రుహుల్ కుద్దూస్ తాలూక్దార్ డిమాండ్ చేశారు. గురువారం నాటోర్ నగరంలోని కనాయిఖలీ చత్తర్‌లో జరిగిన బీఎన్‌పీ బహిరంగ సభలో ఆయన ఈ డిమాండ్‌ను ప్రభుత్వం ముందు పెట్టారు. కాగా, బంగ్లాదేశ్ పరిణామాలపై హసీనా కుమార్తె సైమా వజీద్ పుతుల్ తొలిసారి స్పందించారు. ప్రస్తుతం న్యూఢిల్లీలో ఉంటూ.. ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) ఆగ్నేయాసియా రీజనల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆమె.. బంగ్లాదేశ్ పరిస్థితులను చూస్తుంటే గుండె తరుక్కుపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

"క్లిష్ట సమయంలో అమ్మ ఈ దేశం(భారత్)లోనే ఉన్నా.. ఆమెను కౌగిలించుకోలేని పరిస్థితి" అంటూ ఆమె ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. కాగా, బంగ్లాదేశ్‌లో అనిశ్చితికి జరిగిన కుట్రకు పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐ ఆజ్యం పోసిందని హసీనా కుమారుడు సాజిబ్ వాజెద్ జాయ్ ఆరోపించారు. బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్య పునరుద్ధరణ జరిగాక.. తన తల్లి తిరిగి దేశానికి వస్తారన్నారు. గురువారం ఆయన పీటీఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. తన తల్లికి రక్షణగా నిలిచిన భారత్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అవామీ లీగ్ పార్టీ భారత్‌తో సదా స్నేహపూర్వకంగా ఉంటుందని పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్య పునరుద్ధరణకు భారత్ ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

# బ్రిటన్ విదేశాంగ మంత్రికి జైశంకర్ ఫోన్

## మొదటి పేజీ తరువాయి

బ్రిటన్ విదేశాంగ మంత్రి డేవిడ్ లామీతో భారత విదేశాంగ మంత్రి జైశంకర్ ఫోన్‌లో మాట్లాడారని అధికారులు తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ వివరాలను వెల్లడించారు. ఇరువురూ ఫోన్‌లో బంగ్లాదేశ్ అంశంపై చర్చించారని పేర్కొన్నారు. అయితే.. హసీనా రాజకీయ ఆశ్రయంపై వీరి మధ్య చర్చ జరిగినట్లు తెలుస్తోంది. బంగ్లాదేశ్‌లో శాంతిభద్రతల పునరుద్ధరణ జరగాలని భారత్ కోరుకుంటోందని జైస్వాల్ వివరించారు. కాగా.. బంగ్లాదేశ్‌లో భారత వీసా జారీ సేవలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు అధికారులు వెల్లడించారు.

# ఏది అబద్ధం?

హైదరాబాద్, ఆగస్టు8 : "మేం చెబుతున్నదాంట్లో ఏది అబద్ధం? కాంగ్రెస్ 9 నెలల పాలనలో పంచాయతీలకు 9 పైసలు కూడా ఇవ్వలేదని చెప్పడమా? కేంద్రం విడుదల చేసిన నిధులు ప్రభుత్వం దారి మళ్లించడమా?" అంటూ మంత్రి సీతక్కను మాజీమంత్రి తన్నీరు హరీశ్ రావు ప్రశ్నించారు. మేం అబద్ధం చెబుతున్నామని మంత్రి సీతక్క పేర్కొనడం తగదని, ఈ ప్రభుత్వం వాస్తవాలు గుర్తించి.. సమస్యలు పరిష్కరించకపోగా ప్రతిపక్షాల గొంతునొక్కే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఈ ప్రభుత్వంలో పంచాయతీలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయని, పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడంతో పారిశుధ్య నిర్వహణ కష్టంగా మారిందని ఉన్నమాటంటే ఉలికిపాటు ఎందుకు? అని గురువారం ఒక ప్రకటనలో ఆయన నిలదీశారు.

పారిశుధ్య లోపం కారణంగా గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలి.. ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. పంచాయతీ కార్మికులకు రెండునెలల జీతాలివ్వాలి.. జెడ్పీటీసీ, ఎంపీటీసీలకు 8నెలల గౌరవ వేతనాలివ్వలేదు. మాజీ సర్పంచ్‌లు పెండింగ్ బిల్లులకోసం చలో సచివాలయానికి పిలుపునిస్తే ప్రభుత్వం వారిని పోలీస్‌స్టేషన్లలో నిర్బంధించిందని ఆరోపించారు. ఉపాధిహామీ, హెల్త్ మిషన్‌వంటి పథకాలకు కేంద్రం నుంచి వచ్చిన రూ.2100 కోట్లు గ్రామాలకు ఇవ్వకుండా ప్రభుత్వం దారిమళ్లించిందని, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.500 కోట్లను పంచాయతీలకు ఇవ్వకుండా ఆపలేదా? మంత్రి సమాధానం చెప్పాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# నాగార్జున సాగర్‌కు పోటెత్తిన వరద

## మొదటి పేజీ తరువాయి

వరద పోటెత్తింది. ప్రాజెక్టులోకి 3,74,304 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండగా.. మొత్తం 26 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. విద్యుదుత్పత్తి, కుడి, ఎడమ కాల్వలు, అన్ని మార్గాల ద్వారా జలాశయం నుంచి మొత్తం 4,02,098 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలవుతోంది. ఎగువన ఉన్న శ్రీశైలానికి 3,54,761 క్యూసెక్కుల వరద చేరుతోంది.

ఇటు ఎగువ గోదావరిలో మహారాష్ట్రలోని జైక్వాడి నుంచి శ్రీపాద ఎల్లంపల్లి దాకా ప్రాజెక్టులకు నాలుగు అంకెల వరదే కొనసాగుతోంది. 102.732 టీఎంసీల సామర్థ్యమున్న జైక్వాడిలో ప్రస్తుతం 45.45 టీఎంసీలే ఉండగా.. ప్రస్తుతం ప్రాజెక్టుకు 8,044 క్యూసెక్కుల వరద వస్తోంది. మంజీరా నదిపై ఉన్న సింగూరుకు 1,445 క్యూసెక్కులు, నిజాంసాగర్‌కు 400 క్యూసెక్కులు, ప్రధాన గోదావరిపై ఉన్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టు (ఎస్సారెస్పీ)కు 6,150 క్యూసెక్కులు, కడెం ప్రాజెక్టుకు 6,150 క్యూసెక్కులు, ఎల్లంపల్లి ప్రాజెక్టుకు 8,816 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శుక్రవారం 9 ఆగస్టు 2024





# జిఎస్టీపై తలబిరుసు సమాధానం!

జిఎస్టీ ద్వారా జీవితాలు అతలాకుతలం అవుతున్నా..మోడీ ప్రభుత్వం కించిత్ కూడా పాశ్చాత్తాపం చెందడం లేదు. స్వయంగా కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ, బెంగాల్ సిఎం మమతా బెనర్జీ ప్రస్తావించిన తరవాత పార్లమెంటులో పలువురు సభ్యులు దీనిని ప్రస్తావించారు. అయితే ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పిన సమాధానం చూస్తే షాక్ కావాల్సిందే. ఆమె సమాధానం తలబిరుసుతో ఉన్నట్లుగా ఉంది. జీవిత, ఆరోగ్య బీమాపాలసీ ప్రీమియంలపై జీఎస్టీని రద్దు చేయాలంటూ డిమాండ్లు ఊపందుకున్న వేళ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించిన తీరు చూశాక..మోడీ ప్రభుత్వం ప్రజల సమస్యలను ప్రస్తావించడ మే తప్పన్న రీతిలో ఉన్నట్లుగా అర్థం చేసుకోవాలి. ప్రజల నుంచి వచ్చిన సమస్యలపై చర్చించేది లేదన్న ట్లుగా మోడీ బృందం తీరు ఉంది. జిఎస్టీ అంశంపై కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఆమెకు తొలుత లేఖ రాయగా.. తాజాగా ఇండియా కూటమి సభ్యులు లోక్‌సభ వేదికగా బీమాపై జీఎస్టీ తొలగించాలంటూ డిమాండ్ చేశారు. ఈ క్రమంలో లోక్‌సభలో ఆమె మాట్లాడారు. జీఎస్టీ విధానం అమల్లోకి రాకముందు కూడా బీమా ప్రీమియంలపై పన్ను వసూలు అయ్యేదని నిర్మలా సీతారామన్ గుర్తు చేశారు. ఇదేమీ కొత్త విషయం కాదని, అన్ని రాష్ట్రాల్లో ఇది అమలైందని పేర్కొన్నారు. జీఎస్టీ విధానం అమల్లోకి వచ్చాకా అదే విధానం కొనసాగిందన్నారు. ఇలా వసూలైన జీఎస్టీలో 75 శాతం రాష్ట్రాలకే వెళుతోందని పేర్కొన్నారు. ఇక్కడ ఆందోళన చేస్తున్న వారు ఎప్పుడైనా తమ రాష్ట్రాల్లో దీనిపై చర్చించారా అని ఎదురు ప్రశ్నించారు.

ఒకరు లేవనెత్తిన అంశంపై ఏకంగా 200 మంది ఎంపీలు పార్లమెంట్ వేదికగా అదే పల్లవి అందుకున్నారని ఎద్దేవా చేశారు. అంటే గడ్కరీ లేవనెత్తిన అంశంపై అంటూ...ఎకసక్కెంగా మాట్లాడారు. అంతేగాకుండా లోక్‌సభలో నిర్మలా సీతరామన్ లాగా సమాధానం చెబితే...ప్రజలు మెచ్చరని గుర్తించాలి. పార్లమెంటులో బిజెపి, ఎన్‌డిఎ కూటమి సభ్యులు కూడా ఆమెకు మద్దతుగా చప్పట్లు కొట్టడం మరింత దారుణంగా చూడాలి. నిజంగా ఈ అంశంపై విపక్షాలు గట్టిగా నిలబడి కొట్లాడాల్సిందే. జిఎస్టీ వల్ల జరుగుతున్న నష్టాలను, అనర్థాలను చర్చించాల్సిందే. కానీ విపక్షాలు కూడా పెద్దగా పట్టించుకోలేదు. మొత్తంగా మోడీ తాను తెచ్చిన జిఎస్టీకి మూడే కొమ్ములు అన్న చందంగా తలబిరుసుగా,నిరంకుశంగా ముందుకు సాగుతున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తే ..అది ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్ష పార్టీలన్నీ కలిసి లోక్‌సభలో కొట్లాడుతున్నాయన్న భావనలో మోడీ బృందం ఉంది. ఈ అంశం అధికార బిజెపికి, ఇండియా కూటమికి మధ్య ఉన్న సమస్య కాదని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ గుర్తించటనట్లుగా లేదు. ఇది కోట్లాదిమంది భారతీయులు ఎదుర్కొంటున్న సమస్య. గత పదేళ్లుగా మోడీ ఏ అంశంపైనా చర్చించడం లేదు. పక్కనున్న బంగ్లాలో రిజర్వేషన్ల చిచ్చు.. ఆ దేశ ప్రధానిని పారిపోయేలా చేసింది. ఇలాంటి సమయంలో కూడా ఇక్కడ సమస్యల ను ప్రస్తావిస్తే చర్చ చేయకుండా పొగరుగా సమాధానం ఇవ్వడం సరికాదు. నిజంగా జిఎస్టీ కావచ్చు.. మరేదైనా సమస్య కావచ్చు...మోడీ ఈ మధ్య మాట్లాడడం లేదు. దేశంలో ఎంతగా ఆందోళన వ్యక్తం అవుతున్నా పట్టించుకోవడం లేదు. మోడీ అధికారంలోకి రాకముందు మన్మోహన్ సింగ్‌ను మౌనముని అంటూ పలు సందర్భాల్లో విమర్శించారు. ఇప్పుడు అదే మోడీ మౌనిగా మారారు. తాను చేయదల్చుకున్నది చేస్తున్నారు. చెప్పదల్చుకున్నదే మాట్లాడుతున్నారు. పార్లమెంట్ జరుగుతున్నా హాజరు కావడం లేదు. ప్రజల సమస్యలు ప్రస్తావనకు వచ్చినా పట్టించుకోవడం లేదు. మన్మోహన్‌ను నిందించిన మోడీ తాను చేస్తున్నదేమిటో గుర్తించడం లేదు. వైఫల్యాలను బీజేపీ అంగీకరించ వలసిన సమయం ఇక ఆసన్నమైంది. పార్లమెంటులో మాట్లాడరాదనే మౌనవ్రతాన్ని ప్రధాని మోదీ చేపట్టారని గతంలో అనేకమార్లు విపక్షాలు విమర్శించాయి. నితిన్ గడ్కరీ బిజెపిలోనూ, మంత్రివర్గంలోనూ ఎంతో సీనియర్ నేత. బిజెపి అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. అలాంటి కేంద్రమంత్రి ప్రస్తావించిన జిఎస్టీ అంశాన్ని చర్చించాల్సిన అసవరం ఉంది. విపక్షాలు కూడా గాలివాటంగా జిఎస్టీ ఎత్తేయాలని కోరడం లేదు. బీమాపైనా, చేనేతలపైనా జిఎస్టీ ఎత్తేయాలని కోరుతున్నారు. తాజాగా చేనేతపై జిఎస్టీ ఎత్తేసేందుకు కేంద్రంతో మాట్లాడుతానని ఎపి సిఎం చంద్రబాబు కూడా హామీ ఇచ్చారు. అంటే పన్నులు కారణంగా ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించే ఆయన ఈ మాట అన్నారని భావించాలి. నిజానికి పార్లమెంటులో చర్చలో పాల్గొని ప్రస్తావించే ప్రతి ఒక్కరి ప్రసంగంలోని విషయాలను సానుకూలంగా తీసుకోవాలి. వాటికి సానుకూల వైఖరితోనే సమాధానం చెప్పాలి.

ప్రజలకు భరోసా కల్పించాలి.కానీ మోడీకి అలాంటి ఉద్దేశ్యం లేదని మరోమారు స్పష్టమయ్యింది. ప్రజలు నేరుగా పార్లమెంటుకు వచ్చి ప్రశ్నలు అడగరు. ఎవరో ఒక ఎంపి ద్వారా ప్రశ్నలు అడుగుతారు. పత్రికల ద్వారా సమాచారం చేరవేస్తారు. గ్రామస్థాయి నుంచి పట్టణస్థాయి వరకు వివిధ వేదికల ద్వారా చర్చకు పెడతారు. కానీ నిర్మలా సీతారామన్ దీనిపై ఆలోచిద్దామని చెప్పకుండా పెడసరంగా..ఇది ఇలాగే ఉంటుందని సమాధానం చెప్పడం దారుణం కాక మరోటి కాదు. నిజానికి ప్రజలు ఇలాంటి సమాధానం కోరుకోవడం లేదు. జిఎస్టీ వడ్డింపులు తగ్గించబోమని చెప్పడానికి కారణాలు ఏమిటో చెప్పాలి. ఎందుకు తగ్గించరో చెప్పాలని కోరుకుంటున్నారు. ఇలాంటి సమాధానాల ద్వారా దేశానికి ఎలాంటి సందేశం ఇవ్వబోతున్నారో ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ సమాధానం తేలిపోయిన తరవాత జనానికి మరోమారు మోడీపై విశ్వాసం పోవడం ఖాయం. అడ్డూ అదుపు లేకుండా సాగుతున్న జిఎస్టీ వడ్డింపులపై కేంద్ర ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంటుందని ఎవరైనా ఆశిస్తారు. కానీ ఎలాంటి జవాబుదారీ వహించక పోవడం దారుణం కాక మరోటి కాదు. ప్రజలను పట్టిపీడిస్తున్న పన్నులు వ్యవస్థను సంస్కరించాల్సిందే. తుమ్మినా దగ్గినా జిఎస్టీ అంటే ప్రజలు బతికేదెలా అని ఆలోచించాలి. దీనిపై ఎసి గదుల్లో కొందరు చర్చించకుండా గ్రామాలకు వచ్చి చర్చించాలి. పలు వేదికల ద్వారా చర్చ చేయాలి. అప్పుడే అసలు సంగతులు బయటకు వస్తాయి.

# ఫసల్‌బీమా యోజనతో రైతులకు అండ

## ప్రభుత్వ నిర్ణయంతో రైతుల్లో ఆనందం

నిజామాబాద్,ఆగస్ట్ 8 : కేంద్రం తీసుకుని వచ్చిన ఫసల్ బీమాలో చేరాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో రైతులకు మేలు జరుతుందని కూడా తెలిపింది. రైతులను ఆదుకునే క్రమంలో పసల్ బీమా యోజనలో చేరడం, రైతల కిస్తీకూడా ప్రభుత్వమే భరిస్తుందిన సిఎం, డిప్యూటి సిఎంలు కూడా వెల్లడించారు. రైతులకు కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం రైతాంగానికి వెన్నుదన్నుగా నిలుస్తుంది..ప్రకృతి కరుణించక అనుకోని వైపరీత్యాలతో పంట నష్టపోతూ... ఇక వ్యవసాయం వద్దు అనుకునే రైతన్నకు ప్రధానమంత్రి ఫసల్ భీమ యోజన అండగా నిలుస్తోంది. దేశానికి వెన్నుముక రైతు , రైతు పంటలు పండిస్తేనే ప్రజలకు ఐదు వెళ్ళు నోట్లోకి వేలుతాయి. అలాంటి రైతు తాము పండించిన పంటకు అకాల వర్షాలతోనో అనుకోని వైపరీత్యాలతో పంట నష్టపోతే అ రైతు పరిస్తితి ఏంటి అనుకునే తరుణంలో ఫసల్ బీమాయోజన వారికి ఆసరాగా నిలిచింది. పంట నష్టపోయిన రైతన్నను అమ్మలా అదుకుంటూతుంది. వ్యవసాయం దండుగ అని గతంలో అన్న రైతుకు వ్యవసాయం పండుగా అనేలా ప్రతి రైతు ప్రకృతి వైపరీత్యాలకు బెదరకుండా తమ భూమిని సాగు చేసి వ్యవసాయాన్ని చేసే దైర్యాన్ని ఇస్తుంది.. ఫసల్ బీమా యోజన పథకం. రైతు తాము పండించే పంట పెట్టుబడి ఎకరాకు అందులో రెండు శాతం ఫసల్ బీమా పథకం ప్రీమియం కడితే చాలు వరిపంటకు ఎకరాకు 34 వేల బీమా ఉండగా అందులో రెండు శాతం అంటే 680 రూపాయలు ప్రీమియం కడితే చాలు అలగే మొక్క జొన్న ... వేరుశనిగే పంటలకు రెండు శాతం ఉండగా పసుపు పంటకు మాత్రం 3.5 శాతం ప్రీమియం చెల్లించాల్సి ఉంది.. దీంతో రైతుకు ఎదురయ్యే ఇబ్బందులు తెగుళ్ళు .. వడగళ్ళు.. పిడుగులు.. అకాల వర్షాలతో పంట నష్టపోతే ఆ రైతుకు ఫసల్ బీమా రక్షణగా నిలుస్తుంది.. వీటితో పాటు ఇందులోనే వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం ద్వారా పత్తి పంటతో పాటు మిర్చిపంటకు కూడా రైతు 5 శాతం ప్రీమియం చెల్లిస్తే వాతావరణం అనుకులించాకున్న వేసిన విత్తనం మొలకేత్తకపోయిన రైతుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పంట పెట్టుబడి నష్టపోకుండా ఫసల్ బీమా పథకం అండగా నిలుస్తుంది. పంటకోత తర్వాత జరిగే నష్టాలకూ బీమా వర్తిస్తుంది. పంటనష్టం జరిగిందని తెలియగానే బీమా మొత్తంలో 25 శాతం మొత్తాన్ని నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తారు. అంతేకాదు క్లెయిమ్ సెటిల్ కోసం పంట నష్టాన్ని అంచనా వేయటానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడతారు. స్మార్ట్ ఫోన్ల ద్వారా పంట కోత సమాచారాన్ని ఫొటోలు తీసి, అప్‌లోడ్ చేస్తారు. గతంలో ఎన్నో పంట బీమా పథకాలు ఉన్న కూడా తాము అకాల వర్షాలతో నష్టపోయేవాళ్ళమని... ఇప్పుడు ఫసల్ బీమాపై వ్యవసాయ అధికారులతో పాటు బ్యాంకు అధికారులు అవగాహన కల్పించడంతో తాము వ్యవసాయం అంటే కష్టం కాదని వ్యవసాయాన్ని ఇష్టంతో చేసుతున్నామని రైతులు తెలుపుతున్నారు.

# సాహసోపేత నిర్ణయాలకు పూనుకోవాలి

## సమస్యలపై మరింత శ్రద్ధ పెట్టాలి
## సత్తాచాటే నిర్ణయాలతోనే మోడీకి ఇమేజ్

న్యూఢిల్లీ,ఆగస్ట్ 8 : మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత గత పదేళ్ల పాలన అవినీతిరహితంగా సాగుతుందన్న పేరు వచ్చింది. అలాగే సాహసోపేత నిర్ణయాలు కూడా తీసుకుని సత్తా చాటింది. అయోధ్య, కాశ్మీర్, ట్రిపుల్ తలాక్ విషాయల్లో సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారు. ఇకపోతే ఇంకా పట్టిపీడిస్తున్న సమస్యలు అనేకం ఉన్నాయి. ప్రధానంగా నిరుద్యోగం, ఆహారభద్రత, కరెంట్,నీళ్లు వంటి సమస్యలపై దృష్టి సారించాలి. నదీజలాల విషయంలో సాహసోపేత నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. నదుల అనుసంధానం ద్వారా దేశాన్ని బలోపతేం చేసే దిశగా అడుగులు వేయాలి. జిఎస్టీ లాంటి పన్నులు విధానంపై చర్చించాలి. మోడీ రెండోసారి అధికారంలోకి వచ్చిన తరవాత తీసుకుకున్న నిర్ణయాలు చరిత్రలో నిలిచిపోతాయి. ట్రిపుల్ తలాక్‌కు మంగళం పాడడంతో ముస్లిం మహిళలకు వివాహబంధం విషయంలో భరోసా దక్కింది. అలాగే కాశ్మీర్‌లో 370 ఆర్టికల్ రద్దు కూడా ఒ సాహసోపేత నిర్ణయంగా నిలిచి పోనుంది. మోడీ సర్కార్ సాహస నిర్ణయాలకు వెనకాడదని రుజువు చేసుకుంది. సర్జికల్ స్ట్రయిక్స్ చేసి దాయాది దేశాన్ని ప్రపంచంలో దోషిగా నిలబెట్టిన ఘనత మోడీదే అని చెప్పక తప్పదు. అలాగే అవినీతి మరక అంటకుండా మోదీ దేశాన్ని పాలించారన్న ప్రశంసలు ఉన్నాయి. ఇకపోతే కరోనా వ్యాక్సిన్ తయారీ, ప్రోత్సాహంలో దేశం అతిపెద్ద విజయం సాధించిందనే చెప్పాలి. దేశంలోని ప్రజలకు ఉచితంగా వ్యాక్సిన్ అందించడమే గాకుండా,అనేక దేశాలకు ఉచితంగా వ్యాక్సిన్ అందించి ఆపన్నహస్తం అందచేసింది. ఇలాంటి తరుణంలో మూడోసారి అధికారంలోకి వచ్చారు. అయితే ప్రజలు పూర్తి మెజార్టీ ఇవ్వలేదు. అందువల్ల ప్రజలు మెచ్చే విధంగా పాలన సాగించాల్సి ఉంది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రధానంగా దృష్టి సారించాలి. క్షేత్రస్థాయి నుంచి సమాచారం తెప్పించుకోవాలి. సమస్యలు గుర్తించాలి. గత పదదేళ్లుగా తనవైపు వేలెత్తి చూపే అవకాశం లేకుండా మోదీ జాగ్రత్తగా వ్యవహరించారు. ఎక్కడా ఒక కుంభకోణం అన్నది లేకుండా పాలన సాగిస్తున్న తీరు ప్రజలనుంచి అభినందనలు వస్తున్నాయి. తన వ్యక్తిగత ప్రతిష్టను పెంచుకునేలా చేసుకున్నారు. అయితే పాలనలో మాత్రం అంతగా దూసుకుని పోవడం లేదు. ప్రధానంగా నోట్లరద్దు, జిఎస్టీతో ప్రజలకున్న ఆశలు అడియాశలయ్యాయి. కాంగ్రెస్ విముక్త భారత్ లక్ష్యంగా చేస్తున్న రాజకీయాలు సత్ఫలితాలు ఇవ్వక పోగా కాంగ్రెస్‌ను బలోపేతం చేశాయి. ఇది బిజెపికి దెబ్బగానే చెప్పుకోవాలి. కాంగ్రెస్ పార్టీని దెబ్బతీసే క్రమంలో చేస్తున్న పనులన్నీ దేశహితం కోసమేనని సరిపెట్టుకోలేం. భారతీయ జనతా పార్టీ విస్తరణ కాంక్ష మోదీ, షాలను నిలవనివ్వడం లేదు. ఈ క్రమంలోనే తప్పటడుగులు వేస్తున్నారు. ఇదో గుణపాఠం కావాలి. దేశమంతటా అన్ని రాష్ట్రాలలో భారతీయ జనతాపార్టీ పతాకం రెపరెపలాడాలన్నది ఈ ఇరువురి నాయకుల కోరిక! కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు నీతి వాక్యాలు వల్లె వేస్తోంది గానీ దేశ రాజకీయాలు ఇవ్వాళ ఇంతలా భ్రష్టుపట్టి పోవడానికి ఆ పార్టీనే ప్రధాన కారణం. గతంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం కూడా అనేక అడ్డదారులు తొక్కింది. రాష్ట్రాలలో అధికారం నిలబెట్టుకోవడం కోసం లేదా అధికారంలో ఉన్న ఇతర పార్టీల ప్రభుత్వాలను కూల్చడం కోసం కాంగ్రెస్ పార్టీ చేయని అరాచకం లేదు. ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయనపైకి ఇంటెలిజెన్స్ బ్యూరో వంటి సంస్థలను ప్రయోగించి నానా ఇబ్బందులు పెట్టారు. సీబీఐ ద్వారా విచారణలు జరిపించారు. ఇప్పుడు కాంగ్రెస్ అడుగుజాడలలో అదే నరేంద్ర మోదీ, అవే ఏజెన్సీలను కాంగ్రెస్ నాయకుల మీదకు ప్రయోగిస్తున్నారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడంలో గానీ, ప్రభుత్వ ఏజెన్సీలను దుర్వినియోగం చేయడంలో గానీ కాంగ్రెస్ ఎప్పుడూ ముందుండేది. ఇప్పుడు అదే పంథాను బిజెపి అనుసరిస్తోంది. బిజెపి ఇప్పుడు మిగతా పార్టీలకు భిన్నంగా ఏమీ లేదు. రాజకీయ స్వార్థం కోసం ఎంతకైనా తెగిస్తోంది. ఆ తెగువ పాలనలో కూడా చూపితే దేశం బాగుపడుతుంది. కేవలం విపక్షాలపైనే విచారణలు అన్న ఆరోపణలు పోవాలి. తప్పు చేసిన వారిపై విచారణలు జరగాలి. ఎపిలో జగన్, తెలంగాణలో కెసిఆర్ లాంటి వారి అవినీతిపైనా చర్యలు ఉండాలి. రాజకీయాలు పక్కన పెట్టి దేశం గురించి ఆలోచనచేయాలి. అప్పుడే బిజెపి పట్ల ఆదరణ పెరుగుతంది.

# శ్యామ్ ప్రసాద్ రెడ్డి భార్య వరలక్ష్మి కన్నుమూత

హైదరాబాద్,ఆగస్ట్ 8 : ప్రముఖ నిర్మాత, మల్లెమాల ఎంటర్‌టైన్స్‌మెంట్ అధినేత శ్యామ్ ప్రసాద్‌రెడ్డి ఇంట్లో విషాదం నెలకొంది. దివంగత మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి కుమార్తె, నిర్మాత శ్యాంప్రసాద్ రెడ్డి సతీమణి వరలక్ష్మి కన్నుమూశారు. గతకొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆమె బుధవారం రాత్రి మరణించారు. గురువారం సాయంత్రం 4 గంటలకు జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో ఆమె అంతిమ సంస్కారాలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. వరలక్ష్మి మృతిపట్ల తెలుగు సినీ ప్రముఖులు సంతాపం ప్రకటించారు. టాలీవుడ్‌లో ప్రముఖ నిర్మాతగా గుర్తింపు పొందిన శ్యామ్ ప్రసాద్ రెడ్డి.. అమ్మోరు, అంజి, తలంబ్రాలు, ఆహుతి, అంకుశం, అరుంధతి వంటి హిట్ సినిమాలను రూపొందించారు. ప్రస్తుతం సినిమాలకు దూరంగా ఉంటున్న ఆయన మ్లలెమాల ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యార్‌లో జబర్దస్త్, ఢీ వంటి పలు సూపర్‌హిట్ టీవీ షోలు, సీరియళ్లు నిర్మిస్తున్నారు. ఆమె భౌతిక కాయం వద్ద చిరంజీవి, అల్లు అరవింద్ నివాళి అర్పించారు.

# జనగామ నూతన సిఐగా దామోదర్ రెడ్డి

## ప్రస్తుత సిఐ,ఎస్ఐ ల పై బదిలీ వేటు

జనగామ, ఆగస్టు 8: (రోమింగ్ న్యూస్) : జనగామ పోలీస్ స్టేషన్ ఇన్స్ స్పెక్టర్ గా ప్రస్తుతం వరంగల్ సిసిఎస్ లో విధులు నిర్వహిస్తున్న దామోదర్ రెడ్డిని జనగామకు బదిలీ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం జనగామలో ఇన్స్ స్పెక్టర్ గా పనిచేస్తున్న ఎల్. రఘుపతి రెడ్డి, ఎస్. ఐ పి. తిరుపతి లను పోలీస్ హెడ్ క్వార్టర్స్ కు బదిలీ చేయగా, కానిస్టేబుల్ బి. కరుణాకర్ ను ఏ. ఆర్ కు అటాచ్ చేశారు. తమ క్లైంటుకు అన్యాయం జరుగుతుందని పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వచ్చిన అడ్వకేట్ దంపతులపై ప్రస్తుత సిఐ, ఎస్ఐలు అకారణంగా దుర్భాషలాడుతూ కొడుతూ అమానుషంగా ప్రవర్తించారని అడ్వకేట్లు బుధ గురువారాలు విధులను బహిష్కరిస్తూ ఆందోళన చేపట్టారు. జనగామ అడ్వకేట్లకు మద్దతుగా రాష్ట్ర వ్యాప్తంగా గురువారం అడ్వకేట్లు విధులను బహిష్కరించారు. ఎస్ఏ సీఐ లను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన ఉధృతం అవుతుందని గ్రహించిన పోలీసు అధికారులు ఈ ఆందోళన చిలికి చిలికి గాలివానగా మారే ప్రమాదం ఉందని పసిగట్టి ముందుచూపుతో జనగామ ఎస్ఐ,సీఐలను సస్పెండ్



చేయకుండా బదిలీ చేశారని అనుకుంటున్నారు. ఇటీవల జనగామ పోలీసులపై పలు రకాల ఆరోపణలు రావడం , వీటికి తోడు మొన్న పోలీస్ స్టేషన్ కు వచ్చిన అడ్వకేట్ దంపతులపై కనీస గౌరవం ఇవ్వకుండా వారిపై అమానుషంగా దాడి చేయడం వీటన్నింటి పర్యావసరంగానే ఎస్ఐ సీఐల వేటు పడినట్లు తెలిసింది. ఈ క్రమంలో వీరిని బదిలీ చేస్తూ గురువారం వరంగల్ పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేయడంతో జనగామ పోలీసులను సస్పెండ్ చేయాలని నిరవధికంగా ఆందోళన చేపట్టిన అడ్వకేట్లు తమ ఆందోళనను విరమిస్తారని పోలీసు వర్గాలు భావిస్తున్నాయి .

# బోనాలకు ఎమ్మెల్యేను ఆహ్వానించిన పోలిశెట్టి



భువనగిరి ,ఆగస్టు8(రోమింగ్ న్యూస్) : ఈనెల 11న ఆదివారం భువనగిరి అర్బన్ కాలనీ పోచమ్మ తల్లీ సామూహిక బోనాల పండుగ సందర్బంగా వార్డు మాజీ కౌన్సిలర్, జిల్లా గ్రంధాలయ డైరెక్టర్ పోలిశెట్టి అనిల్ కుమార్ గురువారం భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డిని ఇంటి వద్ద మర్యాద పూర్వకంగా కలిసి బోనాలకు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పెద్దలు గంటపాక జంగయ్య, కడారి వినోద్, కుశంగళ రాజు, డొంకనా సందీప్, పత్తి రమేష్, వస్తుపుల అభినయ్ పాల్గొన్నారు.

# బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించచన మాజీ సర్పంచ్ ఎలిమినేటి క్రిష్ణారెడ్డి



భువనగిరి,ఆగస్టు8(రోమింగ్ న్యూస్) : ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీలలో వడపర్తి పాఠశాల నుండి బదిలీ అయిన ఉపాధ్యాయులను గ్రామ మాజీ సర్పంచ్ ఎలిమినేటి క్రిష్ణారెడ్డి పాఠశాల ఆవరణలో గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ప్రతి ఒక్కరు ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని కోరారు. పాఠశాల నుండి బదిలీ అయిన ఉపాధ్యాయులు గుర్రం రాజు, భీంరెడ్డి శైలజ, బట్టికాడి స్వరూప, పట్ల రమేష్ లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మొక్క ఆంజనేయులు, చైర్మన్ పద్మ, ఉపాధ్యాయులు సుదర్శన్ రెడ్డి, ఉపేంద్రా దేవి, వెంకటేశ్వర్లు, సరస్వతి, తలిదండ్రులు పాల్గొన్నారు.

# ధర్మ స్టూడెంట్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ గా సాయికుమారు



భువనగిరి,ఆగస్టు8(రోమింగ్ న్యూస్) : ధర్మ స్టూడెంట్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ గా సాయికుమార్ ను ఎన్నుకున్నట్లు ధర్మ స్టూడెంట్స్ యూనియర్ రాష్ట్ర కన్వీనర్ కార్తీక్ తెలిపారు. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో ధర్మ సమాజ్ పార్టీ అనుబంధ విద్యార్థి సంఘం ధర్మ స్టూడెంట్స్ యూనియన్ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. డి.ఎస్.యు జిల్లా కోకన్వీనర్లుగా వెలువర్తి రాంబాబు, పిట్ట నవీన్, బర్ల దిలీప్, ట్రెజరర్ భాను, సభ్యులుగా పల్లెర్ల నవీన్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పట్ల నిరంతరం అందుబాటులో ఉంటూ ధర్మ స్టూడెంట్స్ యూనియన్ బలోపేతానికి కృషి చేయాలని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఎప్పటికప్పుడు ప్రశ్నించాలన్నారు. ఈ కార్యక్రమంలో డి ఎస్.యు రాష్ట్ర కోకన్వీనర్ తలారి లింగయ్య, ప్రసాద్, ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ నరేందర్ మహారాజ్, జిల్లా నాయకులు శ్రీకాంత్ మహారాజ్, నరేందర్, స్వామి పాల్గొన్నారు.

# ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డాక్టర్ బొజ్జ సూర్యనారాయణ రెడ్డి



భువనగిరి,ఆగస్టు8(రోమింగ్ న్యూస్) : కాంబిడియాలోని అమెరికన్ యూనివర్సిటీ ఆఫ్ ఫోన్హ్ పెనహాలో ప్రిమాక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న 2 వ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ లో జాగృతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బొజ్జ సూర్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు. ఏవోల్యూషన్ ఇంటర్ ప్లే అండ్ ఇంటిగ్రేషన్ అనే అంశం పైన పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ఇచ్చారు. ప్రెసెంటేషన్ లో వివిధ అంశాలను తగు ఉదాహరణాలతో ప్రస్తావిస్తూ అత్యుత్తమ వాగ్ధాటి తో అనర్గళంగా ప్రెసెంటేషన్ ను కొనసాగించారు. ఈ సందర్భంగా వివిధ దేశాలనుండి వచ్చిన ప్రొఫెసర్ లతో ప్రశంశలు, ప్రెసెంటేషన్ సర్టిఫికేట్ అందుకున్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శుక్రవారం 9 ఆగస్టు 2024





# ఐదుగురు సీనియర్ ఐపిఎస్‌లకు ప్రమోషన్

## డిజిలుగా ప్రమోట్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

హైదరాబాద్,ఆగస్ట్ 8 : రాష్ట్రంలో పలువురు సీనియర్ ఐపీఎస్ అధికారులకు పదోన్నతులు లభించాయి. అదనపు డీజీలుగా ఉన్న ఐదుగురు అధికారులను డీజీలుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి, ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్ రెడ్డితోపాటు అభిలాష బిస్త్, సౌమ్య మిశ్రా, శికా గోయల్‌ను డీజీలుగా ప్రమోట్ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి జీవో విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీ డైరెక్టర్‌గా అభిలాష బిస్త్, జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా, సీఐడీ చీఫ్ శికా గోయల్ పనిచేస్తున్నారు. వారు అవే స్థానాల్లో కొనసాగుతారని ఆదేశాల్లో పేర్కొన్నారు.

# రాష్ట్రంలో త్వరగా హైవేల నిర్మాణం

### లోక్‌సభలో ప్రస్తావించిన ఎంపి ఈటెల

### హామీ ఇచ్చిన మంత్రి నితిన్ గడ్కరీ

న్యూఢిల్లీ,ఆగస్ట్ 8 : నేషనల్ హైవేలను త్వరగా పూర్తి చేయాలని మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. గురువారం నాడు పార్లమెంటులో పలు కీలక విషయాలపై ఈటల మాట్లాడారు. తెలంగాణలో 1947 నుంచి 2004 లోపు ఎన్ని కిలోమీటర్ల నేషనల్ హైవేలు నిర్మాణం అయ్యాయో.. గత పదేళ్లలో అంతకంటే ఎక్కువ కిలోమీటర్ల హైవేలు నిర్మాణం అయ్యాయని వెల్లడించారు. హైదరాబాద్ నుంచి విజయవాడ, హైదరాబాద్ నుంచి ఛత్తీస్‌గఢ్, హైదరాబాద్ నుంచి నాగపూర్ జాతీయ రహదారులు నిర్మాణం అయ్యాయని తెలిపారు. కానీ హైదరాబాద్ సిటీ లోపల ట్రాఫిక్ పెరిగిపోవడంతో రోడ్డు ప్రమాదాలు పెరిగాయని అన్నారు. అందుకోసం అండర్ పాస్, ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఇందుకు సంబంధించి రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కారీకి ఈటల రాజేందర్ విజ్ఞప్తి చేశారు. జోడిమెట్ల చౌరస్తా దగ్గర పది ఇంజనీరింగ్ కాలేజీలకు సంబంధించిన దాదాపు 60 మంది విద్యార్థులు రోడ్డు ప్రమాదంలో మరణించారని వివరించారు. విజయవాడ నేషనల్ హైవేపై రెండు ఓవర్ బ్రిడ్జిలు, అలాగే ఛత్తీస్‌గఢ్ హైవేపై రెండు ఓవర్ బ్రిడ్జిలు, కొంపల్లి నుంచి నాగపూర్ హైవేపై ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలని కోరారు. ఈ మార్గాల్లో మెట్రో రైలు నిర్మాణం చేయాలనే డిమాండ్ కూడా ఉందని గుర్తుచేశారు. ఓవర్ బ్రిడ్జి పనులు జరుగుతున్నాయి కాబట్టి ఈ రెండిటిని కలిపి కోఆర్డినేట్ చేసుకొని నిర్మాణం చేపడితే తక్కువ ఖర్చు అవుతుందని స్పష్టం చేశారు. మంత్రి నితిన్ గడ్కారీ చాలా క్రియాశీలకంగా స్పందిస్తారని ఈ సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఈటల రాజేందర్ కోరారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ అడిగిన పలు ప్రశ్నలకు సభలో నితిన్ గడ్కరీ సమాధానం ఇచ్చారు. తెలంగాణ ఎంపీ ఈటల రాజేందర్ ఆ రాష్ట్రానికి చాలా పనులు కావాలని అడిగారని చెప్పారు. హైదరాబాద్ రింగ్ రోడ్ కోసం రూ.70 వేల కోట్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని గుర్తుచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఈ పనులు తాము చేస్తామని చెప్పారని అన్నారు. 50శాతం ల్యాండ్ అక్విజిషన్‌కి సంబంధించిన డబ్బులు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తామన్నారని. అది పూర్తి అవ్వగానే నిర్మాణం చేపడతామని వివరించారు. ఈ విషయంపై ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కూడా కలిసినట్లు తెలిపారు. విజయవాడ నుంచి హైదరాబాద్ హైవే రోడ్డుపై చాలా ప్రమాదాలు అవుతున్నాయని చెప్పారు. చాలామంది విద్యార్థులు చనిపోయారని కూడా తమ దృష్టికి వచ్చిందని గుర్తుచేశారు. దీనికి తాము కూడా చింతిస్తున్నామని అన్నారు. ఈ విషయంపై త్వరలోనే ఒక నిర్ణయానికి వస్తామని, మిగతా పనులు అన్నీ కూడా త్వరలోనే చేపడతామని నితిన్ గడ్కారీ పేర్కొన్నారు .

# వైద్యరంగంలో జవాబుదారీతనం అవసరం

## సంగారెడ్డి ఆసుపత్రిలో దామోదర ఆకస్మిక తనిఖీ

సంగారెడ్డి,ఆగస్ట్ 8 : వైద్యరంగంలో జవాబుదారీతనం ఉండాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ పేర్కొన్నారు. గురువారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యులు, రోగులతో మాట్లాడి.. వారి సాధకబాధకాలు అడిగి తెలుసుకున్నారు. ఔట్ పేషెంట్ వార్డును మంత్రి పరిశీలించారు . ఆసుపత్రిలో శానిటేషన్ కార్యక్రమాలు చేపట్టాలని పరిశుభ్రత పాటించాలని సూపరింటెండెంట్‌కి సూచించారు. మెడిసిన్ స్టాక్‌రూమ్ లో డయాలసిస్ కేంద్రాన్ని మంత్రి పరిశీలించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో అధ్యాపకులు, మెడికల్ విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. 'సంగారెడ్డి జిల్లా కేంద్రంలో త్వరలో 500 పడకల ఆసుపత్రికి శంకుస్థాపన చేస్తాం. వైద్య వృత్తి చాలా పవిత్రమైంది. దానిని బాధ్యత, జవాబుదారీతనంతో నిర్వర్తించాలి. రోగులతో కలిసిపోతూ వైద్య వృత్తికి న్యాయం చేయాలి. పేదవారందరితోసహా, జబ్బు పడ్డ ప్రతి ఒక్కరికీ నాణ్యమైన ఉచిత వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం. సంగారెడ్డి చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చే నియోజకవర్గ ప్రజలకు జిల్లా కేంద్రం గుండెకాయలాంటిది. ఆసుపత్రి ప్రాంగణాన్ని ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకోవాలి. ప్రైవేటు ఆసుపత్రులు వైద్య నిబంధనలను పాటించాలి. జిల్లా ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య పరికరాలు అందుబాటులో ఉంచాలి. డయాలసిస్ బెడ్లు పెంచాలి. రోగులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి. ఆసుపత్రి ప్రాంగణంలో పెండింగ్‌లో ఉన్న వసతి గృహ,అసంపూర్తి భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలి' అని దామోదర అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ క్రాంతి, ట్రైనీ కలెక్టర్ మనోజ్, టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి , మున్సిపల్ చైర్మన్ విజయలక్ష్మి , ఆర్డీవో వసంత కుమారి , డీఎంఈ వాణి, జీజీహెచ్ సూపరెంటెండెంట్ అనిల్, కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి , ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యానగర్‌లో షాకింగ్ ఘటన

## బస్సు ఆపనందుకు పాము విసిరిన వృద్ధురాలు

హైదరాబాద్,ఆగస్ట్ 8 : హైదరాబాద్‌లోని నల్లకుంట విద్యానగర్‌లో షాకింగ్ ఘటన వెలుగుచూసింది. చెయ్యెత్తినా ఆర్టీసీ బస్సును ఆపకపోవడంతో ఓ వృద్ధురాలు తీవ్ర ఆగ్రహంతో బస్సు డ్రైవర్‌పై పాముని విసిరింది. నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలోని విద్యానగర్ వద్ద ఈ ఘటన జరిగింది. మద్యం మత్తులో ఉన్న సదరు వృద్ధురాలు ఆర్టీసీ బస్సు ఆపే ప్రయత్నం చేసింది. అయితే డ్రైవర్ బస్సు ఆపకుండా వెళ్లాడు. ఆగ్రహంతో తన వద్ద ఉన్న బీర్ బాటిల్‌తో బస్సుపై దాడి చేసింది. దీంతో బస్సు వెనుక భాగంలోని అద్దం ధ్వంసమైంది. అది గమనించిన డ్రైవర్ వెంటనే బస్సు ఆపాడు. బీర్ బాటిల్‌తో కొట్టిన ఆమెను పట్టుకునేందుకు ప్రయత్నించాడు. అయితే సీన్ రివర్స్ అయ్యింది. తీవ్ర ఆగ్రహానికి పెద్దావిడ తన వద్ద ఉన్న పాముని బస్సు డ్రైవర్‌పై విసిరింది. భయభ్రాంతులకు గురైన బస్సు డ్రైవర్ అక్కడి నుంచి పారిపోయాడు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఫిర్యాదు మేరకు నల్లకుంట పోలీసులు రంగంలోకి దిగారు. స్థానికులు ఆమెను పోలీసులకు అప్పగించారు. కాగా డ్రైవర్‌పైకి పాము విసిరిన వృద్ధురాలి బ్యాగులో మరో రెండు పాములు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు.

# మల్లారెడ్డి యూనివర్సిటీలో విద్యార్థి మృతి

హైదరాబాద్,ఆగస్ట్ 8 : మేడ్చల్ జిల్లా పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మైసమ్మగూడలో ఉన్న మల్లారెడ్డి యూనివర్సిటీలో అరుణ్ కుమార్ అనే 19 ఏళ్ల విద్యార్థి మృతి చెందాడు. బీఎస్సీ అగ్రికల్చర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. క్లాసులో స్పృహతప్పి పడిపోవడంతో అతడిని ఆసుపత్రికి తరలించారు. అయితే విద్యార్థి అప్పటికే చనిపోయాడని వైద్యులు నిర్ధారించారు. అంబులెన్స్ ఆలస్యంగా రావడంతోనే విద్యార్థి మృతి చెందాడంటూ విద్యార్థుల

# కండక్టర్‌ను అకారణంగా తొలగించలేదు

### ఆరోపణలపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాం

### జనగామ కండక్టర్ వ్యవహారంపై సజ్జన్నార్ వివరణ

హైదరాబాద్,ఆగస్ట్ 8 : జనగామ డిపోకి చెందిన ఒక కండక్టర్‌ను అకారణంగా విధుల నుంచి తప్పించారని జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని... ఇది పూర్తి అవాస్తవమని టీజీఎస్‌ఆర్టీసీ ఎండీ సజ్జనార్ పేర్కొన్నారు. అసలేం జరిగిందంటే.. ఈ నెల 1వ తేదీన ఒక మహిళ, తన తల్లి, ఏడాది కుమారుడితో కలిసి హన్మకొండ నుంచి హైదరాబాద్‌కు జనగామ డిపోకి చెందిన బస్సు ఎక్కారు. వీరంతా మొదటి వరసలో ఉన్న మహిళా రిజర్వ్‌డ్ సీట్లలో కూర్చున్నారు. ఆ సమయంలో ఆ సీట్లను ఖాళీ చేయాలంటూ కండక్టర్ శంకర్ వారితో అమర్యాదగా, దురుసుగా ప్రవర్తించారు. లేకుంటే బస్సు దిగి వెళ్లిపోవాలని చెప్పారు. తన అమ్మ అనారోగ్యంతో బాధపడుతున్నారని చెప్పినా వినకుండా.. ముగ్గురిని మడికొండ వద్ద బస్సులోంచి దింపేశారు. ఈ విషయాన్ని బాధిత మహిళా ప్రయాణికురాలి భర్త సోషల్ మీడియా ప్లాట్ ఫాం ఎక్స్ ద్వారా టీజీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం దృష్టికి తీసుకువచ్చారు. అందుకు సంబంధించిన వివరాలతో పాటు బస్సు, డ్రైవర్, కండక్టర్ ఫొటోలను సైతం షేర్ చేశారు. ఈ ఘటనపై యాజమాన్యం విచారణకు ఆదేశించింది. ఈ ఆదేశాలతో ఆర్టీసీ వరంగల్ రీజియన్ అధికారులు విచారణ జరిపారు. ఈ విచారణలో మహిళా ప్రయాణికురాలి పట్ల దురుసుగా, అమర్యాదగా ప్రవర్తించడం, నిబంధనలకు విరుద్ధంగా మార్గమధ్యంలో బస్సులోంచి వారిని దించినట్లు తేలడంతో కండక్టర్ శంకర్‌ను విధుల నుంచి తప్పించడం జరిగింది. టీజీఎస్‌ఆర్టీసీ నియమ నిబంధనల మేరకే కండక్టర్‌పై శాఖపరమైన చర్యలను సంస్థ తీసుకుంది. గతంలోనూ శంకర్‌పై ఇలాంటి ఫిర్యాదులే వచ్చాయి. దీంతో రెండు సార్లు సస్పెండ్ చేయడంతో పాటు ఒకసారి ఆయనను విధుల నుంచి తొలగించడం జరిగింది. అంతేకాదు, అధికారులకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా వేర్వేరుగా ఐదుసార్లు మూడున్నరేళ్ల పాటు విధులకు గైర్హాజరు అయ్యారు. మొత్తంగా 12 సార్లు శంకర్‌పై ఫిర్యాదులు వచ్చాయని సజ్జనార్ వెల్లడించారు. అయినా మానవత దృక్పథంతో సంస్థ ఆయనకు పోస్టింగ్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. తాజాగా మళ్లీ ఫిర్యాదు రావడంతో విచారణ జరిపి గతంలో మాదిరిగానే శాఖపరమైన చర్యలను సంస్థ తీసుకుందన్నారు. ఫిర్యాదుల విషయంలో నిబంధనల ప్రకారమే యాజమాన్యం నడుచుకుంటోందని స్పష్టం చేశారు. అన్ని కోణాల్లో సమగ్రంగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటుందని సజ్జనార్ తెలిపారు.

# బిజెపితో బంధమా..విలీనమా..

### కెసిఆర్ అడుగులు హస్తిన వైపు పడేనా?

### బిఆర్ఎస్, బిజెపిల రాజకీయాలపై సర్వత్రా చర్చ



హైదరాబాద్,ఆగస్ట్8 : పదేళ్లపాటు అధికారం అనుభవించి, ఆర్థికంగా బలపడి, ఇష్టారాజ్యంగా పాలన చేసిన బిఆర్ఎస్‌కు ప్రస్తుత పరిస్థితులు మింగుడు పడడం లేదు. వరుసగా మూడోసారి అధికారం
తమదే అనుకున్న తరుణంలో పరిస్థితులు తలకిందులు అయ్యాయి. ఈ ఉక్కపోతను కెసిఆర్ కుటుంబం భరించకోలేక పోతున్నది. ఓ వైపు విచారణ, మరోవైపు విమర్శలు, ఇంకోవైపు కూతురు కవిత జైలకు వెళ్లడం వంటి విషయాలు కెసిఆర్‌ను పుండులాగా సలుపుతున్నాయి. అందుకే దీనిని నుంచి బయటపడే మార్గాల గురించి ఆలోచన చేస్తున్నట్లు చర్చ సాగుతోంది. ప్రధానంగా రేవంత్ సిఎం కావడాన్ని బిఆర్ఎస్ తట్టుకోలేక పోతోంది.ఈ క్రమంలో దీనికి చెక్ పెట్టాలన్న ఆలోచన నుంచే బిజెపికి చేరువ కావాలన్న సూత్రం పుట్టిందన్న ప్రచారం సాగుతోంది. ప్రధానంగా రెండు విషయాలపై బిఆర్ఎస్‌లో అంతర్గతంగా చర్చ సాగుతున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ బిఆర్ఎస్ అంటే కెసిఆర్, కెటిఆర్, హరీష్ రావు లాంటి వారి మధ్యనే అని గుర్తించాలి.
ప్రస్తుత రాజకీయాలను మలుపు తిప్పాలన్నదే వారి ఎత్తుగడగా ఉంది. ఇందులో భాగంగా కేంద్రంతో సఖ్యతగా ఉంటూ కవితను విడిపించుకోవడం...బిఆర్ఎస్ మద్దతను బిజెపికి తెలపడం. అయితే దీనివల్ల కేవలం కవిత మాత్రమే బయటకు రావచ్చు. కానీ అధికారం దక్కదు. అందుకే ఎన్‌డిఎలో చేరేందుకు స్కెచ్ వేసినట్లు తెలుస్తోంది. బిఆర్ఎస్‌కు రాజ్యసభలో నలుగురు సభ్యులు ఉన్నారు. ఐదుగురిలో కేశవరావు జారుకుని రాజీనామా చేశారు. బిజెపికి కూడా రాజ్యసభలో బలం అవసరం. నలుగురు రావడం అంటే తక్కువేమీ కాదు. అందుకే బిఆర్ఎస్, బిజెపిల విలీనపై ఈ మధ్య పుంఖానుపుంఖాలుగా వార్తలు తన్నుకు వస్తున్నాయి. ఇందులో ప్రధానంగా బిఆర్ఎస్ విలీనం అయితే కెసిఆర్ కేంద్రమంత్రిగా ఢిల్లీకి వెళ్లడం.. ఒప్పందంగా ఉండొచ్చు. తదుపరి కాలంలో తెలంగాణలోనూ షిండేలను సృష్టించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం అన్నది కావచ్చు. ఇవన్నీ కూడా ఊహాజనితమే అయినా ..వీటిచుట్టే ప్రచారం సాగుతోంది.
బిఆర్ఎస్, బిజెపి ఎమ్మెల్యేలు కలిశాక వారి బలం ఇప్పుడున్న పరిస్థితుల్లో 36కు చేరుకుంటుంది. ఓ పదిమంది కాంగ్రెస్‌లో చేరారు. వారిని కూడా వెనక్కి రప్పించడం జరగవచ్చు. లేదా కోర్టు ద్వారా ఒకరిద్దరి పై వేటు వేయించి దారికి తెచ్చుకునే ప్రయత్నాలు కూడా సాగుతున్నాయి.అందుకే తెలంగాణ రాజకీయాలు ఊహించని మలుపులు తిరుగుతున్నాయనే భ్రమను కలిపిస్తున్నాయి. భారత రాష్ట్ర సమితి, భారతీయ జనతా పార్టీల మధ్య విలీన చర్చలు జరుగుతున్నాయని విస్తృత ప్రచారం ప్రారంభమయింది. గత నాలుగైదు నెలలుగా ఈ తరహా ప్రచారం అంతర్గతంగా సాగుతోంది.కానీ ఎవరూ స్పందించలేదు. ఇప్పుడు ప్రచారం మరింత ఊపందుకుంది. అయితే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాత్రం ఖండించారు. ఓ ట్వీట్ ద్వారా వీలైనంత బలంగా విలీనం ప్రచారం కుట్ర పూరిత ప్రచారం అన్నారు కానీ.. ఆ వాదనలో బలం ఉందని రాజకీయవర్గాలు భావించడం లేదు. బీఆర్ఎస్ పార్టీ విలీనంపై జరుగుతున్న ప్రచారాన్ని తిప్పి కొట్టడానికి బీఆర్ఎస్ వ్యూహాత్మక నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. అందుకే ఎక్కువ మంది విలీన చర్చలు నిజమేనని అనుకుంటున్నారు. గత నెలలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ముఖ్య నేతలు కేటీఆర్, హరీష్ రావు ఢిల్లీకి వెళ్లారు. కొన్ని కీలక సమావేశాలు ఉన్నప్పటికీ వారు ఢిల్లీలో మకాం వేశారు. వారు ఎవరితో సమావేశమయ్యారో ఎవరికీ తెలియదు. వీరి ఢిల్లీ టూర్‌పై కాంగ్రెస్ పార్టీ సెటైర్లు వేసింది. రేవంత్ రెడ్డి అయితే పార్టీని తాకట్టు పెట్టడానికి వెళ్లారని విమర్శించారు. బీజేపీ నేతల కోసం పడిగాపులు పడుతున్నారని మండిపడ్డారు. బీజేపీతో కలిసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శలు గుప్పించారు. అయితే ఈ విషయంలో బీత్ఎస్ వైపు నుంచి ఎలాంటి స్పందన రాలేదు.

ఇప్పుడ ు తాజాగా మరోసారి కేటీఆర్, హరీష్ రావు ఢిల్లీకి వెళ్లారు. ఒక్క రోజు కొంత సేపు కవితతో తీహార్ జైల్లో ములాఖత్ అయ్యారు. మిగిలిన రోజుల్లో ఏం చేస్తున్నారో .. ఎవరితో సమావేశం అవుతున్నారో స్పష్టత లేదు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హతా వేటు వేయించేందుకు న్యాయనిపుణులతో చర్చిస్తున్నట్లుగా ఓ సారి ఫోటో రిలీజ్ చేశారు. అందుకోసం రోజుల తరబడి అక్కడ ఉండాల్సిన అవసరం లేదు. వీరు బీజేపీ పెద్దలతో రహస్యంగా విలీన ప్రతిపాదనపై చర్చలు జరుపుతున్నారన్న బలమైన సమాచారం బయటకు రావడంతో కొంత మంది నేరుగా ఈ విషయాన్ని ప్రచారం చేస్తున్నారు. నిజానికి నిప్పులేనిదే పొగరాదు. ఎక్కడో ఒకచోట్ఏదో ఒక సందర్భం లేకుండా ఇలాంటి వార్తలు రావు. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య ఎలాంటి విలీనం చర్చలు జరగకపోతే.. ఈ విషయాన్ని ఖండించడానికి రెండు పార్టీలు ఎందుకు తటపటాయిస్తున్నాయన్నది రాజకీయవర్గాల నుంచి వస్తున్న మొదటి ప్రశ్న. నిర్మోహమాటంగా ఖండించడానికి బీఆర్ఎస్ ముఖ్య నేతలు సిద్దంగా లేరు.కీలక నేతలు ప్రతి రోజూ తెలంగాణ భవన్ లో ప్రెస్మీట్లు పెడుతున్నారు కానీ.. బీజేపీతో పొత్తు లేదా విలీనం అంటూ జరుగుతున్న ప్రచారంపై స్పందించడానికి నిరాకరిస్తున్నారు. కేటీఆర్ కూడా ఓ ట్వీట్ పెట్టారు కానీ.. బీజేపీతో ఎలాంటి సంబంధాలు ఉండవని ఖచ్చితంగా చెప్పడం లేదు. తెలంగాణ కోసం పోరాడతామని చెబుతున్నారు. నిప్పు లేనిదే పొగ రాదన్నట్లుగా ఢిల్లీలో ఏదో జరుగుతోందని సులువుగా అర్థమైపోతుంది. స్వయంగా మజ్లిస్ పార్టీ చీఫ్ అసుద్దన్ ఓవైసీ కూడా ఈ అంశంపై బీఆర్ఎస్‌ను ప్రశ్నించినా స్పందన లేదు. నిజానికి బీజేపీ, బీఆర్ఎస్ మధ్య పొత్తు లేదా విలీనం అంశంపై చాలా కాలంగా చర్చలు జరుగుతున్నాయని బీఆర్ఎస్సే నేరుగా ప్రతిపాదన పెట్టినా.. తెలంగాణ బీజేపీ నేతల్లో ఏకాభిప్రాయం లేకపోవడం వల్లనే డీల్ ఆలస్యమవుతోందని ఢిల్లీ వర్గాలు గట్టిగా చెబుతన్నాయి. బీఆర్ఎస్‌తో తీవ్రంగా పోరాడిన ముగ్గురు ఎంపీలు ఆ పార్టీతో ఎలాంటి సంబంధాలు పెట్టుకున్నా సరే అది బీజేపీకి నష్టం చేస్తుందని గట్టిగా వాదిస్తున్నారని అంటున్నారు. అయితే బీఆర్ఎస్ పార్టీకి ఉన్న క్యాడర్ బలం..బీజేపీకి కలసి వస్తుందని.. కింది స్థాయి వరకూ పార్టీ నిర్మాణం ఏర్పడుతుందని .. ఇతర సీనియర్ నేతలు పాజిటివ్‌గా స్పందిస్తున్నారని అంటున్నారు. ఈ కారణంగానే చర్చల్లో ప్రతిష్టంభన ఏర్పడిందని వ్యతిరేకించే వారిని .. సముదాయించి అధికారిక ప్రకటన చేస్తారని చెబుతున్నారు. అయితే బీఆర్ఎస్ క్యాడర్ మాత్రం.. అలాంటి పరిస్థితి రాదని.. కేసీఆర్ తన పార్టీని ఇతర పార్టీల్లో కలిపేంత నిర్ణయం తీసుకోరని అనుకుంటున్నారు. మొత్తంగా ఏం జరుగుతుందో వేచి చూడాల్సిందే.

# ఏనుగుల దాడి నుంచి కాపాడండి

### కుంకీ ఏనుగులను పంపి.. నిలువరించండి

### కర్నాటక అటవీ మంత్రికి పవన్ వినతి

### అడవులను నరికి స్మగ్లింగ్ చేసేలా సినిమాలు

### గతంలో అడవులను కాపాడేలా హీరోయిజం

### పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలతో వైరల్ అవుతున్న విమర్శలు

### పుష్పలో బన్నీ పాత్ర గురించే అంటూ కామెంట్లు

### ఎవరినీ ఉద్దేశించి కాదంటూ నాదెండ్ల వివరణ



బెంగుళూరు,ఆగస్ట్ 8 : చిత్తూరు, శ్రీకాకుళం జిల్లాలో ఏనుగుల బీభత్సం సృష్టించి, ఆస్థి, ప్రాణ నష్టం చేస్తున్న క్రమంలో ఏనుగుల మందలను తరిమేందుకు, కర్ణాటక నుంచి కుంకీ ఏనుగులను పంపించాలని కర్ణాటక రాష్ట్రాన్ని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కోరారు. ఈ మేరకు కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడేందుకు పవన్ బెంగళూరు వెళ్లారు. కర్ణాటక అటవీశాఖ మంత్రి ఈశ్వర్ బి. ఖంద్రేతో భేటీ అయ్యారు. చిత్తూరు జిల్లా పరిధిలోను, పార్వతీపురం ప్రాంతంలోను ఏనుగులు ఊళ్ళ మీదకు వచ్చి పంటలు నాశనం చేస్తున్నాయని, ప్రాణ హాని కలిగిస్తున్నాయని, ఇలా వచ్చే ఏనుగులను తిరిగి అడవిలోకి తరిమేందుకు కుంకీ ఏనుగులు అవసరమని బి. ఖంద్రేకు తెలిపారు. ఈ కుంకీ ఏనుగులు కర్ణాటక అటవీ శాఖ పరిధిలో ఉన్నాయని, కొన్ని కుంకీ ఏనుగులు ఏపీకి ఇవ్వాలని పవన్ కల్యాణ్ కోరారు. దీనిపై కర్ణాటక అటవీ శాఖ మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది. చిత్తూరు జిల్లా పరిధితో పాటు ఇటు పార్వతీపురం ప్రాంతంలో ఏనుగుల సమస్య ఇబ్బందికరంగా మారింది. అవి ఊళ్ళ మీదకు వచ్చి రై తులు కష్టపడి పండించుకున్న పంటలను నాశనం చేస్తున్నాయి. ఫలితంగా ఎంతో మంది నష్టపోతుండగా.. కొంత ప్రాణహాని కూడా ఉంటోంది. ఇలా వచ్చే ఏనుగులను తిరిగి అడవిలోకి తరమడం కోసం కుంకీ ఏనుగులు అవసరం అని భావిస్తున్నారు. ఆ కుంకీ ఏనుగులు కర్ణాటక వద్ద ఉండగా.. 6 కుంకీ ఏనుగులు మన రాష్ట్రానికి ఇచ్చేలా కర్ణాటక అటవీ శాఖను పవన్ కల్యాణ్ కోరారు. ఈ విషయంపై ఆ రాష్ట్ర అటవీశాఖ మంత్రి ఈశ్వర్ బి. ఖంద్రేతో చర్చించారు. ఇంకా ఎర్రచందనం అక్రమ రవాణా విషయంలో కూడా ఇరువురు చర్చలు జరిపినట్లు తెలిసింది. స్మగ్లింగ్ నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ఖండ్రేతో పవన్ చర్చలు జరిపారు. పొరుగు రాష్ట్రాల సహకారంతో ఎర్ర చందనం దోపిడీని అరికట్టవచ్చని పవన్ తెలిపారు. ఎర్ర చందనం స్మగ్లింగ్ కట్టడి కోసం కలిసి పని చేయాలని కోరారు. ఇదే సందర్భంలో పవన్ కళ్యాణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలో సినిమాల్లో హీరోలు అడవులను కాపాడేలా వ్యవహరించి హీరోయిజం చూపేవారని కానీ, ఇప్పుడు పరిస్థితి మారిందని అన్నారు. ఇప్పుడు అడవుల్లో చెట్లను నరికి స్మగ్లింగ్ చేయడం హీరోయిజం అయిందని వ్యాఖ్యానించారు. తాను సినీ రంగానికి చెందిన వాడినే అయినప్పటికీ పరిస్థితులు ఎలా మారిపోయాయో అర్థం చేసుకోవాలని అన్నారు. ఈ 40 ఏళ్లలో ఎక్కడి నుంచి ఎక్కడికి వచ్చాం అంటూ పవన్ ప్రశ్నించారు. గురువారం కర్ణాటక పర్యటనలో ఉన్న పవన్ కళ్యాణ్ ఈ వ్యాఖ్యలు చేయడం హాట్ టాపిక్ అయింది. గురువారం పవన్ బెంగళూరులో కర్ణాటక అటవీశాఖ మంత్రి ఈశ్వర్ బి. ఖండ్రేతో భేటీ అయ్యారు. పవన్ కళ్యాణ్ చేసిన ఈ వ్యాఖ్యలను అల్లు అర్జున్ పుష్ప సినిమాను ఉద్దేశించే చేశారని సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. పుష్ప సినిమా పూర్తిగా ఎర్రచందనం స్మగ్లింగ్ చుట్టే తిరుగుతుంది. అందులో హీరో అయిన అల్లు అర్జున స్మగ్లింగ్ చేస్తూ హీరోయిజం ప్రదర్శిస్తుంటాడు దీంతో అల్లు అర్జున్ ను టార్గెట్ చేసి పవన్ ఈ వ్యాఖ్యలు చేసినట్లు భావిస్తున్నారు. పైగా అల్లు అర్జున్ కు మెగా కుటుంబంతో బేధాభిప్రాయాలు ఉన్నట్లుగా ప్రచారం ఉంది. గత ఎన్నికల సమయంలో అల్లు అర్జున పవన్ కల్యాణ్ కోసం పిఠాపురానికి ప్రచారానికి రాకుండా.. ప్రత్యర్థి పార్టీ అభ్యర్థి కోసం ప్రచారానికి నంద్యాల వెళ్లిన సంగతి తెలిసిందే. ఆ పరిణామం కూడా అప్పట్లో సంచలనం అయింది. ఇలాంటి పరిస్థితుల్లో తాజాగా పవన్ కల్యాణ్ అల్లు అర్జున్ ను ఉద్దేశించే పరోక్షంగా ఈ వ్యాఖ్యలు చేశారని అంతా అనుకుంటున్నారు. అయితే పవన్
వ్యాఖ్యలు సంచలనంగా మారడంతో ఢిల్లీలో ఉన్న మంత్రి నాదెండ్ల మనోహర్ స్పందించారు. పవన్ ఎవరినీ ఉద్దేశించి వ్యాఖ్యలు చేయరని అన్నారు. పవన్ కళ్యాణ్ వ్యక్తిగతంగా ఎవరిని విమర్శించరు. పర్యావరణాన్ని కాపాడాలి, మొక్కలు పెంచాలనే ప్రత్యేక కార్యాచరణతోనే అటవీ పర్యావరణ శాఖ మంత్రిగా పవన్ కళ్యాణ్ చర్యలు తీసుకుంటున్నారఅని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. పవన్ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. మెగా కుటుంబానికి చెందిన ఓ నటుడి గురించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.

# పార్టీ కోసం కష్టపడ్డవారికి నామినేటెడ్ పదవులు

### త్వరలోనే సభ్యత్వ నమోదు కార్యక్రమం

### వైసిపి ఫేక్ ప్రచారాన్ని తిప్పి కొట్టాలని నిర్ణయం

### పోలవరం, అమరావతి నిర్మాణాలపై చర్చ

### తెలంగాణలో పార్టీ బలోపేతంపైనా దృష్టి

### ప్రజల భాగస్వామ్యంతో త్వరలో జన్మభూమి-2

### టీడీపీ పొలిట్‌బ్యూరో సమవేశంలో కీలక నిర్ణయాలు

అమరావతి,ఆగస్ట్ 8 : టీడీపీ పొలిట్‌బ్యూరో సమవేశంలో కీలక నిర్ణయాలు తీసుకుంది.. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో సీఎం, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన పొలిట్ బ్యూరో సమావేశమైంది. ఈ సమావేశం ముగిసిన తర్వాత మీడియాతో మాట్లాడిన ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ రావు.. కార్యకర్తలకు నామినేటెడ్ పదవులిచ్చి వారికి సముచిత స్థానం కల్పించాలని పొలిట్‌బ్యూరో నిర్ణయించిందన్నారు.. పార్టీ కోసం పని చేసిన నేతలు.. కార్యకర్తలను ప్రభుత్వంలో భాగస్వామ్యం చేయాలని చంద్రబాబు సూచించారు. పార్టీ కోసం పని చేసినవారి జాబితా ఇప్పటికే పార్టీ వద్ద ఉంది. పార్టీ బలోపేతం కోసం పని చేసిన కార్యకర్తలకు మంచి స్థానం కల్పించే దిశగా కసరత్తు చేస్తున్నాం. సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టనున్నాం అన్నారు.. ఇక, పోలవరం, అమరావతి నిర్మాణాలపై చర్చ జరిగింది. ఈ రెండు ప్రాజెక్టులను గత ప్రభుత్వం విధ్వంసం చేసింది. నదుల అనుసంధానం ద్వారా రాష్ట్రానికి జరిగే మేలు గురించి చర్చించాం.. కేంద్రం అందించిన సాయంపై పొలిట్ బ్యూరో హర్షం వ్యక్తం చేసిందన్నారు. మరోవైపు.. టీడీపీ హయాంలో పెండింగులో ఉన్న నీరు-చెట్టు బిల్లుల చెల్లింపులపై చర్చించామన్నారు పల్లా శ్రీనివాస్ రావు.. వైసీపీ చేసే దుష్ప్రచారాన్ని తిప్పికొట్టే అంశం మీద మాట్లాడుకున్నామని వెల్లడించారు.. వైసీపీ ఫేక్ ప్రచారాన్ని తిప్పికొడతామని పల్లా శ్రీనివాసరావు తెలిపారు. రాజధాని, పోలవరం నిర్మాణం, నామినేటెడ్ పోస్టులు, నద ుల అనుసంధానంపై చర్చించామని పల్లా శ్రీనివాసరావు వెల్లడించారు. నీరు, చెట్టు బిల్లులపై చంద్రబాబు ఆరా తీశారని చెప్పారు. ఏపీ సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయాన్ని అందించిన టీడీపీ నాయకులు, ప్రజలకు పొలిట్ బ్యూరో తరఫున ధన్యవాదాలు తెలిపారు. వైసీపీ విధ్వంసక పాలన, ఫేక్ ప్రచారంపై సమర్థవంతంగా తిప్పి కొట్టాలని నిర్ణయం తీసుకున్నామని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. జనసేన అధ్యక్షుడు, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పట్టుదల ఈ రాష్ట్రానికి అవసరమని ప్రజలు ఎన్డీఏ కూటమిని గెలిపించారని మాజీ మంత్రి కాలువ శ్రీనివాసులు అన్నారు. పార్టీ నాయకులను, పార్టీని అనుసంధానం చేస్తామని వివరించారు. తొలి ఐదు సంతకాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. ప్రజలు, రైతులు, నిరుద్యోగులకు పార్టీ అండగా ఉ ంటుందని హామీ ఇచ్చారు. రాష్ట్రానికి అమరావతి, పోలవరం రెండు కళ్లు అని ఉద్ఘాటించారు. నదులను అను సంధానం చేస్తే ప్రతి ఎకరాకు నీళ్లు ఇవ్వవచ్చని అన్నారు. కృష్ణా, గోదావరి జలాలను పోతిరెడ్డి పాడు ప్రాజెక్టులో ఎత్తి పోస్తే రాయలసీమ సస్యశ్యామలం అవుతుందని తెలిపారు. పేదరికాన్ని నిర్మూలించేందుకే చంద్రబాబు పీ4 ఫార్ములా తెస్తున్నారని చెప్పారు. అన్ని వర్గాలు, అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. పార్టీ కోసం అంకిత భావంతో పనిచేసిన వారికి నామినేటెడ్ పోస్టులు ఇస్తామని కాలువ శ్రీనివాసులు పేర్కొన్నారు..
జన్మభూమి-2 త్వరలో ప్రారంభం కాబోతోందన్నారు. జన్మభూమి-2లో ప్రజల భాగస్వామ్యం.. దాతల భాగస్వామ్యాన్ని మరింత విస్తృతం చేసేలా ఉంటుంది. నామినేటెడ్ పోస్టుల్లో వడపోత జరుగుతోంది. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేసేలా నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యం ఉంటుందన్నారు. కూటమిగా గెలుపొందాం.. నామినేటెడ్ పోస్టుల భర్తీ విషయంలోనూ అందరి ఆమోదంతో కూర్పు చేయాల్సి ఉంటుంది. పొత్తుల వల్ల టిక్కెట్లు దక్కని వారికి.. సరైన పదవులు దక్కని సీనియర్లకు నామినేటెడ్ పదవుల భర్తీ జరగనుందన్నారు. త్వరలోనే నామినేటెడ్ పదవుల భర్తీకి సంబంధించిన తొలి జాబితా విడుదల చేస్తాం. చంద్రబాబు నాయకత్వం.. పవన్ కల్యాణ్ పట్టుదల అవసరమని ప్రజలు భావించారు. ప్రజారంజక పాలన సాగిస్తూ.. పార్టీని ప్రభుత్వానికి అనుసంధానం చేసేలా ప్రణాళికలు ఏర్పాటు చేసుకుంటాం. తొలి ఐదు సంతకాలతో చంద్రబాబు ప్రజల్లో గొప్ప నమ్మకాన్ని కల్పించగలిగారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, టీడీపీ నేతలకు చంద్రబాబు పలు కీలక విషయాలపై దిశానిర్దేశం చేశారు. నామినేటెడ్ పదవులపై చంద్రబాబు చర్చించారు. వీలైనంత త్వరగా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. పొలిట్ బ్యూరో సవ-ువేశంలో తీసుకున్న కీలక నిర్ణయాలను మీడియాకు మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. 'దక్షిణ భారతదేశంలో జనాభా నిష్పత్తి రోజురోజుకూ తగ్గుతుంది. జనాభా నిష్పత్తి తగ్గడంతో కేంద్రం నుంచి వచ్చే నిధులు సైతం తగ్గుతాయి. తెలంగాణలో టీడీపీ పార్టీ బలోపేతంపై దృష్టి సారించాలి. పార్టీ సభ్యత్వ రుసుం రూ.100లతో ప్రారంభిస్తాం. సభ్యత్వం తీసుకున్న వారు ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి రూ.5 లక్షలు వచ్చే విధంగా పరిహారం ఇవ్వాలని నిర్ణయించారు. పేదరిక నిర్మూలనపై ప్రధానంగా చంద్రబాబు చర్చించారు. త్వరలో పేదరిక నిర్మూలనపై విధివిధానాలు రూపొందిస్తాం. విదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉ న్నవారిని పేదరిక నిర్మూలన కార్యక్రమంలో భాగస్వాములుగా చేయాలని నిర్ణయం తీసుకున్నాం. ఎస్సీ వర్గీకరణకు జిల్లాను యూనిట్‌గా తీసుకుంటాం. జన్మభూమి కార్యక్రమాలు తిరిగి ప్రారంభించాలని చంద్రబాబు నిర్ణయించారు. జన్మభూమి2 గా ఈ కార్యక్రమానికి నామకరణం చేయాలని భావించారు. మొన్నటి ఏపీ సార్వత్రిక ఎన్నికల్లో సరిగ్గా దృష్టి పెడితే వైసీపీ గెలిచిన సీట్లలో మరో నాలుగు నుంచి ఐదు సీట్లు టీడీపీ గెలిచేది' అని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. పొలిట్ బ్యూరోలో ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత 55 రోజుల పాలనపై అధినేత చంద్రబాబు చర్చించారని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. 'త్వరలో జన్మభూమి2 ప్రారంభం కాబోతుంది.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శుక్రవారం 9 ఆగస్టు 2024






# అమెరికాలో పెట్టుబడుల వేట

**సిఎం రేవంత్ చర్చలు ఫలవంతం**

**పలు కంపెనీలు పెట్టుబడులకు సిద్ధం**

**ఒప్పందాలన్నీ ఖచ్చితంగా తెలంగాణ అభివృద్ధి కోసమే**

**నిరాధార వార్తలపై ఐటి సెక్రటరీ జయేశ్ రంజన్ వివరణ**




హైదరాబాద్,ఆగస్ట్ 8 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనలో భాగంగా తెలంగాణకు వచ్చిన పెట్టుబడులన్నీ బోగస్ అంటూ ప్రచారం జరగడాన్ని ఐటి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్ తీవ్రంగా ఖండించారు. మొన్న, నిన్న చేసిన కొన్ని పెట్టుబడుల ప్రకటనలు బోగస్ అని వార్తలు వెల్లువెత్తిన నేపథ్యంలో జయేశ్ రంజన్ వీడియో ద్వారా వివరణ ఇచ్చారు. తెలంగాణకు పెట్టుబడులన్నీ వాస్తవమే అని స్పష్టం చేశారు. పెట్టుబడుల కోసం అమెరికాలో సీఎం రేవంత్ రెడ్డి బిజీగా ఉన్నారని తెలిపారు. ముఖ్యమంత్రి అమెరికాలో చేస్తున్న మీటింగుల విశ్వసనీయత మీద తెలంగాణ ప్రజలకు ఎటువంటి అనుమానాలు అవసరం లేదని తెలిపారు. అన్ని విషయాలు చెక్ చేసిన తర్వాతే మీటింగ్‌లు చేస్తున్నామని జయేష్ రంజన్ వీడియోలో స్పష్టం చేశారు. ఫైనాన్షియల్ సర్వీసెస్లో ప్రపంచంలో పేరొందిన చార్లెస్ స్క్వాబ్ కంపెనీ హైదరాబాద్‌లో తమ సంస్థను నెలకొల్పేందుకు సిద్ధమైంది. అమెరికా పర్యటనలో భాగంగా డల్లాస్‌లో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబుతో ఈ కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు డెన్నిస్ హోవార్డ్, రామ బొక్కా సారథ్యంలో ప్రతినిధులు చర్చలు జరిపారు. ఈ సందర్భంగా టెక్నాలజీ అండ్ డెవెలప్?మెంట్? సెంటర్ ఏర్పాటుపై కీలక నిర్ణయాన్ని వెల్లడించారు. హైదరాబాద్‌లో ఈ కేంద్రం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన సహకారం అందిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. కంపెనీ కార్యకలాపాలను వేగవంతం చేసేందుకు అవసరమైన మార్గదర్శనం చేస్తామని చెప్పారు. తమ కంపెనీ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతుకు కంపెనీ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుకు ఛా÷-లగ్గ÷స్ స్క్వాబ్ తుది అనుమతుల కోసం వేచి చూస్తోంది. త్వరలోనే తమ ప్రతినిధి బృందాన్ని హైదరాబాద్‌కు పంపించనున్నట్లు తెలిపింది. ఈ కంపెనీ విస్తరణతో ఆర్థిక సేవల రంగంలోనూ హైదరాబాద్ ప్రపంచం దృష్టిని ఆకర్షించనుంది. మరోవైపు అమెరికా పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్.. ఆపిల్ సంస్థ హెడ్ క్వార్టర్ ఆపిల్ పార్క్ వెళ్లనున్నారు. ఆపిల్ మ్యానిఫాక్చర్ టీమ్‌తో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి భేటీ కానున్నారు. ట్రినేట్ కంపెనీ సీఈఓతో చర్చించనున్నారు. ఆరమ్ గ్రూప్ ఆఫ్ కంపెనీతో భేటీ అయి హైదరాబాద్‌లో ఆ కంపెనీ డేటా సెంటర్స్ విస్తరణ కోసం చర్చలు నిర్వహించనున్నారు. పలువురు టెక్ కంపెనీల ప్రతినిధులతో లంచ్ మీటింగ్‌లో పాల్గొననున్నారు. అంగెన్ సంస్థ సీనియర్ లీడర్‌షిప్‌తో పెట్టుబడులపై చర్చలు నిర్వహించ నున్నారు. ఎలక్ట్రానిక్ పరికరాల సంస్థ రెనేశాస్ తో, మ్యానిఫాక్చర్ సంస్థ అమాట్‌తో ఇన్వెస్ట్‌మెంట్‌పై చర్చలు నిర్వహించనున్నారు. పలు బిజినెస్ సంస్థలతో రౌండ్ టేబుల్ సమావేశంలో రేవంత్ పాల్గొననున్నారు. అలాగే బుధవారం ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడితో చర్చలు సఫలం కానున్నాయి. ఫోర్త్ సిటీ, మూసీ సుందరీకరణ, స్కిల్ యూనివర్సిటీ, ప్రజారోగ్య రంగాల్లో సహకారం అందించడానికి ప్రపంచ బ్యాంకు అంగీకరించింది. నిపుణులతో ఉన్నత స్థాయి కమిటీకి నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీలో 400 కోట్లు పెట్టుబడితో ఇన్జెక్టబుల్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వెయ్యి మందికి ఉద్యోగాలు కల్పించేలా వివింట్ సంస్థ కృషి చేస్తామని తెలిపింది. లైఫ్ సైన్సెస్ రంగంలో ఇన్నోవేషన్ డెవలప్మెంట్ కోసం కార్నింగ్ కంపెనీ సహకరిస్తామని తెలిపింది. అంకాలజీ, క్రిటికల్ కేర్ విభాగంలో సహకారం కోసం కార్నింగ్ కంపెనీతో తెలంగాణ సర్కార్ ఎంఓయూ కుదుర్చుకుంది.

## తెలంగాణలో రెండురోజుల పాటు తేలికపాటి వర్షాలు

### హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

హైదరాబాద్,ఆగస్ట్ 8 : తెలంగాణలో రెండురోజుల పాటు అక్కడక్కడ పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. పలు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని.. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని తెలిపింది. శుక్రవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగామ జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను ప్రకటించింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24గంటల్లో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో మోస్తరు వర్షాపాతం నమోదైంది. మెదక్, మహబూబాబాద్, కొత్తగూడెం, ఖమ్మంలో పలుచోట్ల భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం గంగారంలో 13.6 సెంటీమీటర్ల వర్షాపాతం రికార్డయ్యింది. సదాశివునిపల్లిలో 8.6లో, సత్తుపల్లిలో 7 సెంటీమీటర్ల వర్షం కురిసింది.

## శ్రీశైలంలో నాటుసారా విక్రయం

### నలుగురు మహిళల అరెస్ట్

శ్రీశైలం,ఆగస్ట్ 8 : నంద్యాల జిల్లా శ్రీశైలం గ్రామంలో నాటు సారా విక్రయిస్తున్న నలుగురు మహిళలను పోలీసులు అరెస్టు చేశారు. ప్రకాశం జిల్లా దోర్నాల మండలం చెర్లోపల్లి గ్రామానికి చెందిన నలుగురు మహిళలు నల్లబోతుల నాగేంద్ర, పిక్కిలి రాజేశ్వరి, నల్లబోతుల రవణమ్మ, నల్లబోతుల లక్ష్మి శ్రీశైలం గ్రామం వాసవి సత్రం వద్దకు వచ్చారని సబ్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. వారిని తనిఖీ చేయగా వారి వద్ద ఉన్న13 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ గురువయ్య, రఘునాథుడు, బాలకృష్ణ, మహేష్, శంకర్, అమర్నాథ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## బంగ్లాలో కొనసాగుతున్న అనిశ్చితి

### భారత వీసా సెంటర్లు మూసివేత

ఢాకా,ఆగస్ట్ 8 : రాజకీయ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న బంగ్లాదేశ్ లో తాత్కాలిక ప్రభుత్వ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. శాంతి భద్రతలు ఇంకా అదుపులోకి రాలేదని సమాచారం. దీంతో అనేక మంది పౌరులు వీలైనంత త్వరగా దేశాన్ని వీడేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే వేలాదిమంది భారత సరిహద్దులకు చేరిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాల వేళ బంగ్లాలోని భారత దౌత్యాధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. వీసా దరఖాస్తు కేంద్రాలను నిరవధికంగా మూసివేశారు. ఈమేరకు భారత వీసా కోసం దరఖాస్తు చేసుకునే ఆన్‌లైన్ పోర్టల్‌లో సందేశం పెట్టారు. ‘బంగ్లాదేశ్ వ్యాప్తంగా అన్ని వీసా దరఖాస్తు సెంటర్లను తదుపరి నోటీసులిచ్చేంతవరకు మూసివేస్తున్నాం. అస్థిర పరిస్థితుల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నాం. తదుపరి దరఖాస్తు తేదీపై ఎస్ఎంఎస్ ద్వారా సమాచారమిస్తాం‘ అని అందులో వెల్లడించారు. అనిశ్చితి నేపథ్యంలో బంగ్లాదేశ్ లోని భారత హైకమిషన్, కాన్సులేట్‌లో పనిచేసే అత్యవసర విధుల్లో లేని సిబ్బంది, వాటి కుటుంబాలను ఇప్పటికే దిల్లీకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. అయితే, దౌత్యవేత్తలు మాత్రం బంగ్లాలోనే ఉంటారని, దౌత్య కార్యాలయాలు యథావిధిగా పనిచేస్తాయని కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ క్రమంలోనే తాజాగా వీసా సెంటర్లను మూసివేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. భారత్‌కు ఢాకాలో హైకమిషన్‌తో పాటు చిట్టగాంగ్, రాజ్‌షాషీ, ఖుల్నా, సిల్‌హెట్ నగరాల్లో కాన్సులేట్లు ఉన్నాయి. ఇదిలాఉండగా.. బంగ్లాలో ఉద్రిక్తతల దృష్ట్యా ఒడిశా తీరంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. 480 కిలోమీటర్ల తీర ప్రాంతంలో పటిష్ట నిఘాను ఏర్పాటుచేశారు. చిన్న బోట్లతో బంగ్లాదేశీయులు అక్రమంగా ప్రవేశించే అవకాశం ఉన్న నేపథ్యంలో ముందుజాగ్రత్తగా ఈ నిర్ణయం తీసుకున్నారు. అల్లర్ల సమయంలో కొందరు నేరస్థులు బంగ్లా జైళ్ల నుంచి బయటకు వచ్చినట్లు ఒడిశా పోలీసులకు సమాచారం అందినట్లు తెలిసింది.

## తెలంగాణకు పెట్టుబడులపై విషప్రచారం

**ఓడిన నైరాశ్యంలో బిఆర్ఎస్ నేతల విమర్శలు**

**సిఎం రేవంత్ టూర్‌పై దుష్ప్రచారం తగదు**

**మండిపడ్డ కాంగ్రెస్ నేత సంపత్**

హైదరాబాద్,ఆగస్ట్ 8 : సీఎం రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనపై బీఆర్ఎస్ నేతలు బాల్క సుమన్, క్రిశాంక్ చేసిన వ్యాఖ్యలను ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ తిప్పి కొట్టారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ... ‘బాల్క సుమన్, క్రిశాంక్‌లు కేటీఆర్‌కు విరుద్ధంగా మాట్లాడుతున్నారు. కేటీఆర్‌కు సుమన్, క్రిశాంక్ మధ్య చెడినట్లుంది‘ అంటూ వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన విజయవంతం కావాలని కేటీఆర్ కోరుకున్నారని తెలిపారు. ఓడిపోయిన నైరాశ్యంలో బీఆర్ఎస్ నేతలు ఏం మాట్లాడుతున్నారో అర్థం కావట్లేదని మండిపడ్డారు. తెలంగాణలో నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన కోసం సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు కృషి చేస్తున్నారన్నారు. పెట్టుబడుల కోసమే సీఎం, మంత్రులు అమెరికా వెళ్లారన్నారు. ఓర్వలేక సీఎం రేవంత్ రెడ్డిపై ఆయన కుటుంబంపై కొందరు విషం కక్కుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొడంగల్లో రేవంత్ రెడ్డి రివ్యూ మీటింగ్ జరిగేటప్పుడు కాంగ్రెస్ ఇంచార్జ్‌గా తిరుపతి రెడ్డి అధ్యక్షత వహించారని తెలిపారు. కొండల్ రెడ్డి ఆస్ట్రేలియా టూర్ అధికారిక పర్యటన కాదని స్పష్టం చేశారు. ఇంకో సోదరుడుకి అమెరికాలో స్వచ్ బయో కంపెనీ ఉందని... దానిద్వారా తెలంగాణలో పెట్టుబడులు పెడితే తప్పేంటి? దాని మీద ఎందుకు రాజకీయం చేస్తున్నారు అని నిలదీశారు. పది సంవత్సరాలలో కేసీఆర్ కుటుంబం మొత్తం తెలంగాణలో విస్తరించారన్నారు. రేవంత్ రెడ్డి ఎనిమిది నెలలలో కుటుంబాన్ని ఎక్కడ చూపించలేదని తెలిపారు. శ్రీరాముడి కల్యాణానికి భద్రాచలం ఆయన మనుమడు తలంబ్రాలు తీసుకెళ్లిండు. కుటుంబ పాలన అంటే కేసీఆర్ ది. రేవంత్ రెడ్డిది కాదు. కావాలనే బట్ట కాల్చి మీద ఏస్తున్నారు. ప్రాంతం వారు మోసం చేస్తే అక్కడే బొంద పెట్టాలి, ప్రాంతీయేతరులు మోసం చేస్తే బయట బొంద పెట్టాలని కాళోజీ నారాయణ రావు చెప్పారు. అందుకే పది ఏండ్లు తెలంగాణను మోసం చేసిన కేసీఆర్‌ను ప్రజలు బొంద పెట్టారు. మరొకసారి బద్నాం చేయాలని చూస్తే మెమేంటో చూపిస్తాం‘ అంటూ సంపత్ కుమార్ హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సీఎం రేవంత్ తన సోదరులను తెలంగాణ మీదకు వదిలేశారని.. అతని సోదరులకు ఏ పదవులు లేకున్నా రాజ్యాంగేతర శక్తులుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సాక్షాత్తూ అసెంబ్లీ కమిటీ హాల్‌లో రేవంత్ సోదరుడు తిరుపతి రెడ్డి ఏ హోదా లేకున్నా స్పీకర్ దగ్గర వికారాబాద్ రివ్యూ మీటింగ్‌లో పాల్గొన్నారని తెలిపారు. కొడంగల్‌లో తిరుపతి రెడ్డి కల్యాణ లక్ష్మి చెక్కులను పంచుతుంటే తమ జెడ్పిటీస్ మహిపాల్ అడ్డుకున్నారని తెలిపారు. రేవంత్ మరో సోదరుడు కొండల్ రెడ్డికి ఏ హోదా ఉందని అధికారులతో కలిసి ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్నారని ప్రశ్నించారు. రేవంత్ అమెరికా పర్యటనలో స్వచ్ బయోతో రాష్ట్ర ప్రభుత్వం వెయ్యి కోట్ల ఒప్పందం కుదుర్చుకుందని... ఆ కంపెనీ రేవంత్ మరో సోదరుడు ఎనుముల జగదీశ్ రెడ్డిది అని తెలిపారు. పదిహేను రోజుల క్రితమే ఆ కంపెనీ ఏర్పాటయ్యిందని అన్నారు. ఇవే కాకుండా రేవంత్ సోదరుల ఆధ్వర్యంలో నాలుగు సంస్థలు ఏర్పాటు అయ్యాయన్నారు. ఈ సంస్థల ద్వారానే రేవంత్ బ్లాక్ మనీని వైట్‌గా మారుస్తున్నారని విమర్శలు గుప్పించారు. ప్రధాన కంపెనీలే కాకుండా రేవంత్ సోదరులు అనేక మైక్రో సంస్థల్లో డైరెక్టర్లుగా ఉన్నారన్నారు. రేవంత్ సోదరులు రియల్టర్లను బెదిరించి విచ్చల విడిగా అవినీతికి పాల్పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ వ్యాఖ్యలు చేశారు.

## ఆరో రోజుకు నిజాం హాస్టల్ విద్యార్థినుల ఆందోళన

### హాస్టల్ సమస్యలు పరిష్కరించాలంటూ వంటావార్పు

హైదరాబాద్,ఆగస్ట్ 8 : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిజాం కాలేజీ హాస్టల్ డిగ్రీ విద్యార్థినులు చేపట్టిన ఆందోళన కొనసాగుతోంది. గురువారం కూడా విద్యార్థులు తరగతులకు హాజరవ్వకుండా ఆందోళన చేపట్టారు. ఈ నిరసన ఆరో రోజుకి చేరుకుంది. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిజాం కాలేజీ వీసీకి ఆదేశాలిచ్చినా విద్యార్థులతో నామమాత్రంగానే చర్చలు జరిగాయి. అయితే ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ రంగంలోకి దిగి విద్యార్థులకు నచ్చజెప్పడానికి ప్రయత్నించారు. వారు చేస్తున్న ధర్నా వద్దకి వెంకట్ చేరుకుని విద్యార్థినులతో చర్చించారు. తొలుత సమస్యలపై కళాశాల ప్రిన్స్‌పాల్‌తో మాట్లాడారు. సమస్యను పరిష్కరిస్తామని ఔఉ విద్యార్థులకు ఆయన ప్రభుత్వం తరపున హామీ ఇచ్చారు. అయితే, మరో వైపు పీజీ విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఔఉ వాళ్లకి హాస్టల్ కేటాయిస్తే ఖఉ విద్యార్థులు పరిస్థితి ఏంటని నిరసనకు దిగారు. తమకు న్యాయం చేయాలని పీజీలు విజ్ఞప్తి చేశారు. గర్ల్స్ హాస్టల్ డిగ్రీ వాళ్లకే కేటాయిస్తే , తాము ఉస్మానియా యూనివర్సిటీ నుంచి రావాల్సి వస్తుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ట్రాఫిక్‌లో బస్సుల్లో సమయానికి కాలేజీకి చేరుకోలేక పోతున్నామని పీజీలు ఆవేదన వ్యక్తం చేశారు. కాలేజీ ఆవరణంలో మరో భవనం నిర్మిస్తే సమస్య పరిష్కారం అవుతుందని సీనియర్లు చెబుతున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ వీసీతో చర్చించి, సమస్యను పరిష్కరిస్తానని పీజీ విద్యార్థులకు బల్మూరి వెంకట్ హామీ ఇచ్చారు. మరోవైపు.. కేసీఆర్ ప్రభుత్వం నిజాం కాలేజ్ విద్యార్థినుల కోసం, యూజీ, పీజీ విద్యార్థినుల కోసం వేర్వేరుగా హాస్టల్ భవనాలు కట్టించింది. అయితే ప్రస్తుతం ఉన్న యూజీ హాస్టల్ భవనంలో పీజీ వారికి 50 శాతం, యూజీ వారికి 50 శాతం కేటాయించారు. ఇలా చేయడాన్ని నిరసిస్తూ విద్యార్థినులు ఆందోళనకు దిగారు. కాగా.. తమ సమస్యపై విద్యార్థినులు మాజీ విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని కలిసి గత ఆదేశాలకు అనుగుణంగా 100 శాతం యూజీ విద్యార్థినులకే హాస్టల్ భవనాన్ని కేటాయించేలా చూడాలని విద్యార్థినులు కోరారు. వారి ధర్నా పట్ల సబితా ఇంద్రారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గత కేటాయింపుల మాదిరిగానే 100 శాతం యూజీ విద్యార్థినులకు కేటాయించి వారికి న్యాయం చేయాల్సిందిగా నిజాం కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ భీమా నాయక్‌కు సబితా సూచించారు. అయితే, యూజీ విద్యార్థినులు ఆందోళనలో భాగంగా ఇవాళ వంటావార్పు చేపట్టారు. వసతి గృహాన్ని తమకే కేటాయించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తు కార్యాచరణ చేపట్టేందుకు వారు సన్నద్ధమవుతున్నారు. యూజీ, పీజీ విద్యార్థులకు సమానంగా హాస్టళ్లు కేటాయిస్తామని అధికారులు వెల్లడించగా, దీనికి యూజీ విద్యార్థులు అంగీకరించలేదు. యూజీ విద్యార్థుల కోసం నిర్మించిన హాస్టల్‌లో గదులన్నీ తమకే కేటాయించాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్ల కోసం తాము పోరాడుతున్నామని అన్నారు.

## మల్లన్న సాగర్‌లోకి గోదావరి జలాలు

### కాళేశ్వర ఎత్తిపోతల వద్ద మోటర్లు ఆన్

సిద్దిపేట,ఆగస్ట్ 8 : కాళేశ్వర జలాల విడుదలపై బీఆర్ఎస్ పోరాటం ఫలించిందని ప్రకటించుకుంది. మల్లన్నసాగర్‌లోకి సాగునీటిని ప్రభుత్వం విడుదల చేసింది. రంగనాయక సాగర్ నుంచి మల్లన్నసాగర్‌లోకి నీటిని ఎత్తిపోస్తున్నది. గోదావరి జలాలు సముద్రంపాలవుతున్నా రాజకీయ కక్షతో ప్రభుత్వం కాళేశ్వరం నుంచి నీటిని విడుదల చేయలేదని ఇప్పటికే ఆ పార్టీ ఆరోపించింది. దీంతో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులు ఉద్యమ బాటపట్టారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్‌రావు హెచ్చరికలతో దిగివచ్చిన ప్రభుత్వం కాళేశ్వరం పరిధిలోని రిజర్వాయర్లకు నీటిని విడుదల చేస్తున్నదని తెలిపింది. వర్షాభా పరిస్థితులతో సిద్దిపేట జిల్లాలోని రిజర్వాయర్లు వట్టిపోతున్నాయని, కాళేశ్వర జాలాలతో వాటిని నింపి రైతాంగాన్ని ఆదుకోవాలని ఎమ్మె ల్యే హరీశ్‌రావు ఇటీవల నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి లేఖ రాసిన విషయం తెలిసిందే. దీంతో స్పందించిన ప్రభుత్వం అనంతగిరి రిజర్వాయర్ నుంచి నీటిని ఎత్తిపోసే పక్రియను ప్రారంభించింది. మంగళవారం రెండు మోటర్లను ఆన్‌చేయడంతో గోదావరి జలాలు రంగనాయకసాగర్‌లోకి పరుగులు పెట్టాయి. 3 టీఎంసీల సామర్థ్యంగల రంగనాయకసాగర్‌లోకి రెండు పంపుల ద్వారా 6600 క్యూసెక్కుల నీటిని ప్రాజెక్టులోకి ఎత్తిపోస్తున్నారు. తాజాగా రంగనాయక సాగర్ నుంచి మల్లన్నసాగర్‌లోకి నీటిని ఎత్తిపోస్తున్నారు. 50 టీఎంసీల సామర్థ్యంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం మల్లన్న సాగర్‌ను నిర్మించిన విషయం తెలిసిందే. ఇక కొండపోచమ్మ సాగర్‌కు గురువారం రాత్రికి గోదావరి జలాలు చేరనున్నాయి.శనివారం వరకు నీటిని ఎత్తిపోసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, అప్పటి వరకు నీటి లభ్యతను బట్టి గోదావరి జలాలు ఎత్తిపోయనున్నట్లు అధికారులు తెలిపారు. గోదావరి జలాలతో నింపుతుండటంతో ఆయకట్టు పరిధిలోని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ పోరాటంతోనే నీటి విడుదల జరిగిందని సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

## ఎస్‌ఎల్‌బిసిని నిర్లక్ష్యం చేసిన గత ప్రభుత్వం

### మండలి ఛైర్మన్ గుత్తా సంచలన వ్యాఖ్యలు

నల్లగొండ,ఆగస్ట్ 8 : సుంకిశాల నిధులను ఎస్ఎల్ బీసీ సొరంగానికి కేటాయించి ఉంటే ఇప్పటికే పూర్తి జరిగి, గ్రావిటీ ద్వారా ఈజీగా వాటర్ వచ్చే అవకాశం ఉండేదని శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేం దర్ రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను గత ప్రభుత్వం పట్టించుకోకుండా, పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. పెండింగ్ ప్రాజెక్టులపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇప్పటికే అధికారులను ఆదేశించి, పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. వచ్చే రెండేళ్లలో నక్కలగండి, పెండ్లిపాకల ప్రాజెక్టులను పూర్తిచేసి హైదరాబాద్‌కు తాగునీరు అందిస్తామన్నారు. పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి, బునాదిగాని ఆయకట్టు కాలువల నిర్మాణం, లైనింగ్ పూర్తి చేయాలన్నారు

## జిఎస్టీ కుంభకోణంలో సిఐడి దూకుడు

### మాజీ సిఎస్ సోమేశ్ కుమార్ తదితరులకు నోటీసులు రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం

హైదరాబాద్,ఆగస్ట్ 8 : జిఎస్టీ కుంభకోణంలో సిఐడి అధికారులు దూకుడు పెంచారు. జిఎస్‌టి కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటు చేసుకునే అవకాశం కనిపిస్తోంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న మాజీ సిఎస్ సోమేశ్ కుమార్‌తో పాటు ఈ కేసుతో సంబంధం ఉన్న మరికొందరికి నోటీసులు ఇచ్చేందుకు సిఐడి అధికారులు సిద్ధమవుతున్నారు. కొద్ది రోజుల్లోనే వీరికి నోటీసులు అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది. మొదట ఈ కేసు దర్యాప్తును హైదరాబాద్ సిసిఎస్ పోలీసులు చేపట్టారు. కేసు తీవ్రత దృష్ట్యా ప్రభుత్వం ఈ కేసును సిఐడికి అప్పగించింది. సిసిఎస్ నుంచి ఎఫ్ఐఆర్ ఆధారంగా కేసు నమోదు చేసిన సిఐడి అధికారులు దర్యాప్తును ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా సిఐడి అధికారులకు కీలక సమాచారం అందినట్లు తెలుస్తోంది. ఈ సమాచారం మేరకే మాజీ సిఎస్ సోమేశ్ కుమార్ సహా నిందితులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న సర్వీస్ టాక్స్ అదనపు కమిషనర్ ఎస్వి కాశీ విశ్వేశ్వరరావు, డిప్యూటీ కమిషనర్ శివరామ ప్రసాద్, అసిస్టెంట్ ప్రొఫెసర్ శోభన్ బాబు, ప్లియాంటో టెక్నాలజీస్ కంపెనీ నిర్వాహకులకు నోటీసులు అందించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. స్పెషల్ ఇనిషియేటివ్స్ వాట్సాప్ గ్రూపు ద్వారా సోమేశ్ కుమార్ సర్వీస్ టాక్స్ అధికారులు విశ్వేశ్వరరావు, శివరామ ప్రసాద్, శోభన్ బాబులకు ఆదేశాలు ఇచ్చినట్లు సిఐడి అధికారులు ఆధారాలను సేకరించినట్లు చెబుతున్నారు. కమర్షియల్ టాక్స్ సెంట్రల్ కంప్యూటర్ వింగ్ జాయింట్ డైరెక్టర్ రవి కనూరి అందించిన ఆడిట్ రిపోర్ట్ ఆధారంగా దర్యాప్తును సిఐడి అధికారులు చేపట్టారు. ఇన్పుట్ టాక్స్ క్రెడిట్ చెల్లింపుల్లో రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ సహా 75 కంపెనీలకు లబ్ది చేసినట్లు ఆధారాలను సేకరించారు. ఈ కుంభకోణంతో ప్రభుత్వ ఖజానాకు సుమారు 1000 కోట్లకుపైగా నష్టం వాటిల్లినట్లు సిఐడి అధికారులు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. సిఐడి దర్యాప్తు ముమ్మరం అయితే కీలక అంశాలు వెలు గులోకి వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ కేసును సిఐడి అధికారులు ప్రత్యేకంగా తీసుకొని దర్యాప్తు చేస్తున్నారు. తెలంగాణ ప్రభు త్వం కూడా ఈ కేసుపై సీరియస్ గానే దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ పెద్దలు ఈ కేసు విషయంలో ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలుసు కుంటున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ప్రభుత్వ ఖజానాకు కోట్లాది రూపాయలు నష్టం వాటిల్లేలా చేశారని ప్రభుత్వం భావించిన నేపథ్యంలోనే దీనిపై విచారణ చేపట్టింది. వీలైనంత వేగంగా విచారణ పక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఉన్న నేపథ్యంలో సిఐడి అధికారు లు దూకుడు పెంచారు. కొద్దిరోజుల్లోనే నోటీసులు అందించి వారిని విచారించేందుకు సిఐడి అధికారులు సిద్ధమవుతున్నారు. సదరు అధికారుల ను విచారించిన తర్వాత కీలక అంశాలు బయటపడే అవకాశం ఉందని చెబుతున్నారు.

## 20 లక్షలం లంచం తీసకున్న ఇడి అధికారి

### అరెస్ట్ చేసిన సిబిఐ అధికారులు

హైదరాబాద్,ఆగస్ట్ 8 : ముంబైకు చెందిన ఒక నగల వ్యాపారి నుంచి రూ. 20 లక్షల లంచం పుచ్చుకుంటున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఇడి) అసిస్టెంట్ డైరెక్టర్ ఒకరిని సిబిఐ గురువారం అరెస్టు చేసింది. ఆగస్టు 3, 4 తేదీలలో ఆ నగల వ్యాపారి ప్రాంగణాలలో ఇడి సోదాలు నిర్వహించింది. తనకు రూ. 25 లక్షల లంచం ఇవ్వకపోతే నగల వ్యాపారి కుమారుడిని అరెస్టు చేస్తానని ఇడి అసిస్టెంట్ డైరెక్టర్ సందీప్ సింగ్ యాదవ్ బెదిరించినట్లు సిబిఐ వెల్లడించింది. బేరసారాలు జరపగా రూ. 20 లక్షలకు వారి మధ్య ఒప్పందం కుదిరిందని సిబిఐ అధికారులు తెలిపారు. సెంట్రల్ బోర్డు ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్(సిబిడిటి) నుంచి ఇడిలో చేరిన యాదవ్‌ను లంచం తీసుకుంటుండగా ప్రత్యక్షంగా పట్టుకున్నట్లు అధికారులు చెప్పారు.రి

## సామాన్యుల కష్టాలు జగన్‌కు ఏం తెలుసు

### మండిపడ్డ మంత్రి నాదెండ్ల

న్యూఢిల్లీ,ఆగస్ట్ 8 : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పై మంత్రి నాదెండ్ల మనోహర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కోటల్లో ఉండే జగన్‌కు సామాన్య ప్రజల గురించి ఏం తెలుసని అన్నారు. గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. జగన్ రెండు రోజుల క్రితం ఏపీలో రాష్ట్రపతి పాలన విధించాలని కోర్టుకు వెళ్తామని చేసిన ప్రకటనపై నాదెండ్ల స్పందించారు. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన ఎందుకు పెట్టాలో చెప్పాలని డిమాండ్ చేశారు. వృద్ధులకు రూ. 4వేల పింఛన్ ఇస్తున్నందుకా, పోలవరం ప్రాజెక్టు పనులు ప్రారంభిస్తున్నందుకా అని ప్రశ్నించారు. మాజీ సీఎం ప్రతిపక్ష హోదా , భద్రతాపై కాకుండా ప్రజల గురించి , ప్రజల అవసరాలు ఏంటో తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. వైసీపీ తాడూ, బొంగరం లేని పార్టీ అని విమర్శించారు. వైసీపీకి అధ్యక్షుడు , ప్రధాన కార్యదర్శి ఎవరో తెలియదని పేర్కొన్నారు.

## రాజ్‌తరుణ్‌కు హైకోర్టులో ఊరట

### ముందస్తు బెయిల్ ఇచ్చిన కోర్టు

హైదరాబాద్,ఆగస్ట్ 8 : టాలీవుడ్ నటుడు రాజ్ తరుణ్‌కు హైకోర్టులో ఊరట లభించింది. అతడికి తెలంగాణ హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. తనను మోసం చేశాడు అంటూ లావణ్య అనే యువతి రాజ్ తరుణ్‌పై నార్సింగి పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టిన విషయం తెలిసిందే. లావణ్య ఇచ్చిన ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు రాజ్ తరుణ్‌పై కేసు నమోదు చేసి విచారణకు హాజరు కావాల్సిందిగా కోరారు. అయితే దీనిపై రాజ్ తరుణ్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో తనపై నమోదైన కేసులో ముందస్తు బెయిలు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం అతడికి షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసింది. అలాగే.. రూ.20వేలతో రెండు పూచికత్తులు సమర్పించాలని ఆదేశించింది. ఇటీవల 'పురుషోత్తముడు' 'తిరగబడరసామీ' అనే సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు రాజ్ తరుణ్. వారం గ్యాప్‌లో వచ్చిన ఈ సినిమాలు బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌గా నిలిచాయి.

## లావణ్యపై దాడి వ్యవహారం

### శేఖర్ బాషాపై పోలీస్ కేసు

హైదరాబాద్,ఆగస్ట్ 8 : ఆర్‌జే శేఖర్‌పై జూబ్లీహిల్స్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఓ యూట్యూబ్ ఛానల్ డిబేట్‌లో పాల్గొన్న తనపై ఆర్‌జే శేఖర్ తనపై దాడి చేశాడని రాజ్‌తరుణ్ ప్రియురాలు లావణ్య జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దర్యాప్తు చేసిన పోలీసులు కేసు నమోదు చేశారు. ఇటీవల ఓ యూట్యూబ్ ఛానల్‌లో డిబేట్ జరిగింది. ఈ చర్చలో ఆర్‌జే శేఖర్, లావణ్యపై తీవ్ర ఆరోపణలు చేశాడు. ఆగ్రహానికి గురైన లావణ్య చెప్పుతో శేఖర్‌పై దాడి చేసింది.అనంతరం లావణ్యపై ఆర్‌జే శేఖర్ భూతులు తిడుతూ దాడి చేశాడు. దీంతో లావణ్య శేఖర్ తన కడుపుపై దాడి చేశాడని, చేతికి గాయం అయిందని ఫిర్యాదులో పేర్కొంది. శేఖర్ భాషాతో తనకు ప్రాణహాని ఉందని పోలీసులకు ఫిర్యాదు చేసింది. దర్యాప్తు చేసిన పోలీసులు శేఖర్‌పై 74,115(2) కింద కేసు నమోదు చేశారు. హీరో రాజ్‌తరుణ్ ప్రేమ పేరుతో మోసం చేశాడని లావణ్య జులై 5వ తేదీన నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేసింది. లావణ్య ఆధారాలు సమర్పించడంతో రాజ్‌తరుణ్‌పై కేసు నమోదు చేశారు.

## సాగర్‌కు కొనసాగుతున్న వరద ప్రవాహం

### 26 గేట్లు ఎత్తడంతో కృష్ణమ్మ పరుగులు

నల్లగొండ,ఆగస్ట్ 8 : నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు వరద ఉధృతి కొనసాగుతున్నది. దీంతో 26 గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. 22 గేట్లు 5 అడుగులు, 4 గేట్లు 10 అడుగుల మేర ఎత్తి నీటిని విడిచిపెడుతున్నారు. సాగర్‌లోకి 2.53 లక్షల క్యూసెక్కుల వరద వస్తున్నది. 2.69 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగుకాగా ప్రస్తుతం 585.30 అడుగులుగా ఉన్నది. ప్రాజెక్టు గరిష్ట నీటి నిల్వ 312.50 టీఎంసీలు కాగా, ఇప్పుడు 298.30 టీఎంసీలుగా నమోదయింది. సాగర్ నుంచి భారీగా వరద వస్తుండటంతో దిగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు పూర్తిగా నిండింది. జలాశయంలోకి 2.57 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా, 11 గేట్ల ద్వారా 2.30 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175 అడుగులు కాగా, ప్రస్తుతం 167.9 అడుగుల వద్ద ఉన్నది. 45.77 టీఎంసీలకుగాను 35.50 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నాగార్జునసాగర్ వద్ద సుంకిశాల రిటెయినింగ్ వాల్ కూలిపోయింది. ఆగస్టు 1న జరిగిన ఈ ఘటనను అధికారులు గోప్యంగా ఉంచారు. కార్మికులు షిఫ్టు మారే సమయంలో ఈ ఘటన జరగడంతో పెను ప్రమాదం తప్పింది. సుంకిశాల రిటెయినింగ్ వాల్ కూలడంతో పంప్ హౌస్ క్షణాల్లో జల దిగ్బంధమైంది. హైదరాబాద్‌లో తాగునీటి అవసరాల కోసం సుంకిశాల పథకం చేపట్టారు. సొరంగాల్లోకి జలాలు రాకుండా రక్షణగా రిటెయినింగ్ వాల్ నిర్మించారు. సాగర్ జలాశయం డెడ్ స్టోరేజీ నుంచి జలాల తరలింపునకు సుంకిశాల పథకం చేపట్టారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శుక్రవారం 9
ఆగస్టు 2024





# పారిస్‌లో భారత్ హాకీ కాంస్య కాంతులు

## స్పెయిన్‌పై చిరస్మరణీయ గెలుపు

## కెరీర్‌కు గోల్‌కీపర్ శ్రీజేశ్ వీడ్కోలు




భారత హాకీ జట్టు వరుసగా రెండో ఒలింపిక్ పతకం సాధించడంలో గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేషది ప్రత్యేకమైన పాత్ర. పరాజయానికి, పతకానికి మధ్య అడ్డుగోడలా నిలబడి భారత హాకీ జట్టుకు ఎన్నోసార్లు ఆనందాన్ని పంచిన గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేష్ ఆఖరి మ్యాచ్‌లోనూ తనదైన మార్క్ చూపించాడు. టోక్యో క్రీడల తరహాలోనే పారిసలోనూ తనదైన ముద్ర వేచి ఆఖరి మ్యాచ్‌ను చిరస్మరణీయం చేసుకున్నాడు.
కేరళలోని ఎర్నాకులం జిల్లా కిజక్కంబలం గ్రామానికి చెం దిన 36 ఏళ్ల శ్రీజేష్.. మొదట రన్నింగ్, లాంగ్‌జంప్, వాలీబాల్ క్రీడలు ఆడాడు. పన్నెండేళ్ల వయసులో తన పాఠశాల పీఈటీ సూచనతో హాకీని ఎంచుకున్నాడు. పేద రైతు కుటుంబం నుంచి వచ్చిన శ్రీజేషకు మొదట్లో గోల్‌కీపింగ్ కిట్‌ను కొనేందుకు కూడా డబ్బులు లేవు. తన తండ్రి ఆవును అమ్మి సమకూర్చిన డబ్బులతో కిట్‌ను కొనుకున్నాడు. 2006లో తొలిసారి సీనియర్ జట్టులో చోటు దక్కించుకున్న శ్రీజేష్.. 2011 నుంచి జట్టులో కీలక ఆటగాడిగా కొనసాగాడు. శ్రీజేష్ వచ్చేనాటికి గోల్‌కీపర్లుగా అడ్రియన్ డిసౌజా, భరత్ ఛెత్రి జట్టులో పాతుకుపోయి ఉన్నారు. దీంతో అప్పుడప్పుడు మాత్రమే జట్టులో చోటు దక్కించుకున్న శ్రీజేష్.. 2011లో చైనా వేదికగా జరిగిన చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ రూపంలో వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాడు. పాకిస్థాన్‌తో జరిగిన ఆ తుదిపోరులో రెండు పెనాల్టీ స్ట్రోక్‌లను నిలువరించి జట్టును గెలిపించడంతో అందరి దృష్టి శ్రీజేషపై పడింది. అతని గోల్‌కీపింగ్ నైపుణ్యాన్ని చూసి దిగ్గజ ఆటగాళ్లు సైతం అబ్బురపడ్డారు.



# రజత చోప్రా

## పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు సిల్వర్ మెడల్

## జావెలిన్‌త్రోలో 89.45 మీటర్లతో రెండో స్థానం

పారిస్: నాలుగేండ్ల క్రితం టోక్యో ఒలింపిక్స్‌లో ఎలాంటి అంచనాలూ లేకుండా బరిలోకి దిగి బరిసెతో భారత్‌కు అథ్లెటిక్స్‌లో తొలి స్వర్ణం అందించిన 'గోల్డెన్ బాయ్' నీరజ్ చోప్రా పారిస్‌లోనూ రజతంతో మెరిశాడు. స్టేట్ డి ఫ్రాన్స్ వేదికగా గురువారం అర్ధరాత్రి జరిగిన జావెలిన్ త్రో ఫైనల్‌లో నీరజ్ రెండో ప్రయత్నంలో 89.45 మీటర్ల దూరం విసిరి రెండో స్థానంతో సిల్వర్ మెడల్ కైవసం చేసుకున్నాడు. వరుసగా రెండో స్వర్ణమే లక్ష్యంగా బరిలోకి దిగిన నీరజ్.. తుదిపోరులో అంచనాలను ఆశించిన స్థాయిలో అందుకోలేకపోయాడు. పాకిస్థాన్ అథ్లెట్ అర్షద్ నదీమ్ ఒలింపిక్స్‌లో మునుపెన్నడూ లేని విధంగా ఏకంగా 92.97 మీటర్ల రికార్డు త్రో తో పసిడి సొంతం చేసుకున్నాడు. కెన్యా అథ్లెట్ పీటర్స్ అండర్సన్ 88.54 మీటర్ల దూరం విసిరి కాంస్యం గెలుచుకున్నాడు. తాజా ఎడిషన్‌లో భారత్‌కు ఇది ఐదో పతకం కాగా మొదటి రజతం. హాకీ జట్టుతో పాటు షూటింగ్‌లో 3 కాంస్యాలు వచ్చాయి.

### నదీమ్ రికార్డు త్రో.. నీరజ్ తడబాటు

తొలి ప్రయత్నంలో బరిసెను అందుకున్న నీరజ్‌తో పాటు అర్షద్ త్రోలు ఫౌల్ అయ్యాయి. కానీ రెండో ప్రయత్నంలో మాత్రం నదీమ్ రెచ్చిపోయాడు. అతడు విసిరిన ఈట ఒలింపిక్ పాత రికార్డులన్నింటినీ చెరిపేసింది. విశ్వక్రీడల చరిత్రలో ఇదే అత్యుత్తమం. తద్వారా అతడు 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో ఆండ్రీస్ (నార్వే) విసిరిన 90.57 మీటర్ల రికార్డు బ్రేక్ అయింది. 'టోక్యో'లో నీరజ్ స్వర్ణం గెలవగా అర్షద్ ఐదో స్థానంలో నిలవగా పారిస్‌లో మాత్రం అర్షద్ పసిడి పట్టుకుపోయాడు. అర్షద్ తర్వాతే వచ్చి జావెలిన్‌ను అందుకున్న నీరజ్.. తన అనుభవన్నంతా ఉపయోగించి 89.45 మీటర్ల త్రో విసిరాడు. కానీ ఆ తర్వాత నీరజ్ వేసిన నాలుగు త్రో లు ఫౌలే కావడం గమనార్హం. రెండో త్రో తో రికార్డు సృష్టించిన నదీమ్.. ఆరోసారి 91.79 మీటర్ల దూరం విసిరి రెండుసార్లు 90 మీటర్ల మార్కును దాటడం విశేషం. గత ఒలింపిక్స్‌లో రజతం గెలిచిన జాకబ్ వెడ్లిచ్ ఈసారి (88.50 మీటర్లు) నాలుగో స్థానంతో సరిపెట్టుకున్నాడు.




# వినేష్ ఫోగట్‌కు భారీ ఊరట..!

### ఫైనల్ ఆడే అవకాశం ఇవ్వాలని అప్పీల్

### అప్పీల్‌ను స్వీకరించిన కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్

### రజత పతకంపై చిగురించిన ఆశలు

భారత రెజ్లర్ వినేష్ ఫోగట్‌కు భారీ ఊరట లభించింది. పారిస్ ఒలింపిక్స్ 2024లో అసాధారణ ప్రదర్శనతో మహిళల 50 కేజీల ఫ్రీస్టైల్ విభాగంలో ఫైనల్ చేరిన వినేష్ ఫోగట్.. చివరి క్షణంలో అనర్హత వేటుకు గురైన విషయం తెలిసిందే. 100 గ్రాముల అధిక బరువు కారణంగా ఫైనల్ ఆడకుండా ఆమెను ఒలింపిక్స్ నిర్వాహకులు డిస్‌క్వాలిఫై చేశారు. ఈ అనర్హత వేటుపై వినేష్ ఫోగట్.. కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్‌ను ఆశ్రయించింది. రూల్స్ ప్రకారమే నిర్దేశిత బరువుతో సెమీఫైనల్ చేరిన తనకు కనీసం రజత పతకమైనా ఇవ్వాలని లేకుంటే.. ఫైనల్ ఆడే అవకాశం ఇవ్వాలని అప్పీల్ చేసింది. ఈ అప్పీల్‌ను కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ స్వీకరించింది. దాంతో ఆమె రజత పతకంపై ఆశలు చిగురించాయి. కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్ వినేష్ ఫోగట్‌కు అనుకూలంగా తీర్పు ఇస్తే రజతం పతకం ఇచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ విభాగం పోటీలు ముగిసాయి. సెమీస్‌లో వినేష్ ఫోగట్ చేతిలో ఓడిన క్యూబా రెజ్లర్ గుజ్మన్ లోపేజ్ ఫైనల్ ఆడింది. బుధవారం అర్ధరాత్రి జరిగిన ఫైనల్లో అమెరికా రెజ్లర్ సారా హిల్డర్‌బ్రాంట్ 3-0తో క్యూబా రెజ్లర్‌ను చిత్తు చేసింది. దాంతో ఆమెకు స్వర్ణం దక్కగా.. గుజ్మన్‌కు రజతం దక్కింది. ఫస్ట్ రౌండ్‌లో వినేశ్ ఫోగట్ చేతిలో ఓడిన జపాన్ ప్లేయర్ సుసాకీ కాంస్య పతకం దక్కింది. వినేష్ ఫోగట్ డిస్‌క్వాలిఫై కావడంతో సుసాకీకి రేపిచేజ్ రూపంలో కాంస్యపోరు ఆడే అవకాశం దక్కింది. రెండో ఛాన్స్ రావడంతో వరల్డ్ నెంబర్ వన్ ర్యాంకర్ 10-0తో ఉక్రెయిన్ ప్లేయర్ ఒక్సానా లివాచ్‌ను ఓడించింది.

ప్రతి అక్షరం - ప్రజల కోసం

రోమింగ్ న్యూస్


తెలుగు దినపత్రిక

Roaming News

## నాగచైతన్య , నటి శోభితా ధూళిపాళ్ల నిశ్చితార్థం

### వివరాలు వెల్లడించిన తండ్రి నాగార్జున

టాలీవుడ్ హీరో నాగచైతన్య , నటి శోభితా ధూళిపాళ్ల నిశ్చితార్థం జరిగింది. దీనికి సంబంధించిన ఫొటోలను నటుడు నాగార్జున సోషల్‌మీడియాలో పంచుకున్నారు. నా తనయుడు నాగచైతన్య, శోభితా ధూళిపాళ్ల నిశ్చితార్థం ఈరోజు ఉదయం 9.42 గంటలకు జరిగింది. ఈ విషయాన్ని మీ అందరితో పంచుకోవడం సంతోషంగా ఉంది. మా కుటుంబంలోకి ఆమెను సంతోషంగా ఆహ్వానిస్తున్నాం. నూతన జంటకు నా అభినందనలు. వీరి జీవితం సంతోషం, ప్రేమతో నిండాలని కోరుకుంటున్నా 8.8.8 అనంతమైన ప్రేమకు నాంది అని నాగార్జున పేర్కొన్నారు. దీనిపై పలువురు నెటిజన్లు స్పందించారు. కొత్త జంటకు శుభాకాంక్షలు తెలిపారు. నాగచైతన్యకు గతంలో నటి సమంతతో పెళ్లయ్యాక కొంతకాలానికి వ్యక్తిగత కారణాల వల్ల వారిద్దరూ విడిపోయారు. చై-శోభిత ఎంతోకాలం నుంచి స్నేహితులుగా ఉన్నారు. ఇక సినిమాల విషయానికి వస్తే.. శోభిత ధూళిపాళ్ల 2013లో ఫెమినా మిస్ ఇండియా టైటిల్ విన్నర్‌గా నిలిచారు. 2016లో సినీ రంగంలోకి ప్రవేశించారు. ప్రస్తుతం టాలీవుడ్, బాలీవుడ్‌తో పాటు హాలీవుడ్‌లోనూ వరుస అవకాశాలు అందుకుంటున్నారు. నాగచైతన్య 'తండేల్'తో బిజీగా ఉన్నారు. చందూ మొండేటి దర్శకత్వంలో ఇది రూపొందుతోంది.





## ఆ కథ నాకోసమే రాసినట్లుగా ఉంది: తాప్సీ

హసీన్ దిల్‌రుబా'తో 2021లో విజయాన్ని అందుకున్నారు నటి తాప్సీ ఇప్పుడు దీనికి కొనసాగింపుగా తెరకెక్కిన 'ఫిర్ ఆయీ హసీన్ దిల్‌రుబా' విడుదలకు సిద్ధంగా ఉంది. ఈనేపథ్యంలోనే తాప్సీ తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. 'హసీన్ దిల్‌రుబా'లో హీరోయిన్ పాత్ర కోసం మొదట వేరే నటిని అనుకున్నారని చెప్పారు. అనుకోని కారణాల వల్ల ఆమె సినిమాలో నటించకపోవడంతో.. తాను ఆ ప్రాజెక్ట్‌లో భాగమయ్యానని చెప్పారు. తానొక విభిన్నమైన కథతో సినిమా చేయాలనుకుంటున్నానని దర్శకురాలు కనికా ధిల్లాన్ ఓసారి నాకు చెప్పారు. ఆ కథ వినేందుకు నేనెంతో ఆసక్తిగా ఉన్నానని ఆమెకు తెలియజేశా. అదే సమయంలో నేను వేరే సినిమా షూటింగ్‌లో బిజీ అయ్యా. ఆ షూట్ పూర్తయ్యేసరికి.. కనికా వేరే నటిని సంప్రదించినట్లు తెలిసింది. వారిద్దరి మధ్య ఒప్పందం కుదిరిందని త్వరలో ఆ సినిమా పట్టాలెక్కనున్నట్లు వార్తలు వచ్చాయి. కొన్ని నెలల తర్వాత కనికా ఫోన్ చేసి.. ఎందుకు? ఏమిటి? అని ప్రశ్నించకుండా స్క్రిప్ట్ నరేషన్ కోసం ఆఫీస్‌కు రమ్మని పిలిచింది. స్క్రిప్ట్ విన్న వెంటనే ఈ కథ నాకోసమే రాసినట్లు అనిపించింది. వెంటనే ఆ ప్రాజెక్ట్‌కు ఓకే చెప్పా' అని తాప్సీ చెప్పారు. ఇందులో తాప్సీ నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో యాక్ట్ చేశారు. 2021లో నెట్‌ఫ్లిక్స్ వేదికగా విడుదలైన ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పడీ చిత్రానికి కొనసాగింపుగా సిద్ధమైన 'ఫిర్ ఆయీ హసీన్ దిల్‌రుబా' ఆగస్టు 9న విడుదలకు సిద్ధంగా ఉంది. విక్రాంత్ మస్సే, సన్నీ కౌశల్ ప్రధాన పాత్రల్లో కనిపించనున్నారు.



## ఆమె నవ్వితే నవరత్నాలు ఏరుకోవాలి!

అవును.. ఆమె నవ్వితే నవరత్నాలు ఏరుకోవాలి. ఆ అందమైన నవ్వు హృదయాలను గెలుచుకుంది. తన ప్రతిభకు ప్రత్యేకించి అభిమానులున్నారు. అందుకే బుల్లితెర యాంకర్ గా, పెద్ద తెర నటిగా ఓ వెలుగు వెలుగుతోంది. టాలీవుడ్ లో క్షణం తీరిక లేని నటీమణుల్లో ఒకరిగా ఆమె పేరు మార్మోగుతోంది. ఆమె ఎవరో ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. ది గ్రేట్ అనసూయ గురించే ఇదంతా. యాంకర్ కం క్యారెక్టర్ నటి అనసూయ తన ఫ్యామిలీ లైఫ్‌ని వర్క్ లైఫ్‌తో బ్యాలెన్స్ చేస్తూ రైడ్ ని కొనసాగిస్తున్న సంగతి అభిమానులకు తెలిసిందే. కెరీర్ పరంగా ఎంత బిజీగా ఉన్నా కానీ పర్సనల్ లైఫ్ కి ప్రాధాన్యతనిస్తుంది. పనిలోపనిగా అనసూయ లేటెస్ట్ ఫోటోషూట్లు యువతరంలో వైరల్ గా దూసుకెళుతున్నాయి. తాజాగా అనసూయ శారీ లుక్ ఫోటోషూట్ అందరినీ ఆకట్టుకుంటోంది. బ్లూ స్లీవ్ లెస్ బ్లౌజ్ కాంబినేషన్ చీరలో అనసూయ ఎంతో అందంగా కనిపిస్తోంది. నీలి రంగు గులాబీల అల్లికతో రూపొందించిన డిజైనర్ శారీ ఆకర్షణీయంగా కనిపిస్తోంది. అందమైన నవ్వు.. ఆ మత్తు కళ్లతో యువహృదయాల్లో ఊహించని మ్యాజిక్ చేస్తోంది అనసూయ. ప్రస్తుతం ఈ ఫోటోషూట్ వైరల్ గా షేర్ అవుతోంది. ఇటీవల సినిమాలతో బిజీ అయిన అనసూయ బుల్లితెరపై జోరు తగ్గించిన సంగతి తెలిసిందే. వరుసగా సినిమాల్లో నటిస్తోంది. తదుపరి పుష్ప 2లో అనసూయ గ్లింప్స్ గురించి అభిమానులు ఆసక్తిగా వేచి చూస్తున్నారు.

Printed, published and owened by GOTTIPARTHI MADHURI, printed at MADHURI OFFSET PRINTERS H.NO 3-133, BC colony yadagirigutta, dist : Yadadri Buvanagiri pin : 508115, Ts Publictions at Madhuri publications. Editor : GOTTIPARTHI BHASKER. RNA TELTEL /2021/80986